

వార్త
ఆదివారం
23 ఫిబ్రవరి, 2025

# శివోహం.. జనోహం!

# హరీష్ శంకర్ దర్శకత్వంలో బాలకృష్ణ?



**నందమూరి బాలకృష్ణ** ఇటీవల 'దాకు మహారాజ్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు. ఇక ఈ సినిమా తర్వాత బోయపాటి శ్రీను డైరెక్షన్‌లో ఆయన 'అఖండ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కాగా, ఈ సినిమా పూర్తి కాకముందే బాలయ్య తరువాతి సినిమా గురించి వివిధ వార్తలు వినిపిస్తున్నాయి. బాలకృష్ణ త్వరలోనే దర్శకుడు హరీష్ శంకర్‌తో ఓ సినిమా చేయబోతున్నాడని గత కొంత కాలంగా టాక్ వినిపిస్తోంది. అయితే, ఇప్పుడు ఈ విషయం కన్ఫర్మ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హరీష్ శంకర్ చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనీ, ఇప్పుడు ఈ సినిమాను ప్రొడ్యూస్ చేసేందుకు ప్రముఖ బ్యానర్ కూడా ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ బాలయ్య-హరీష్ శంకర్ కాంబినేషన్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నారట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా రావచ్చని సినీ సర్కిల్స్‌లో వార్తలు వస్తున్నాయి. నిజంగానే హరీష్ శంకర్‌తో బాలయ్య మూవీ ఉంటుందా లేదా.. అనేది చూడాలి మరి!

**తారాతీరం**

# 'కింగ్‌డమ్'లో విజయ్ దేవరకొండ



**విజయ్ దేవరకొండ,** గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో 'వీడీ 12' వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న కొత్త చిత్రం గత వారం టీజర్ విడుదలైంది. ఈ చిత్రానికి పవర్‌ఫుల్ టైటిల్ 'కింగ్‌డమ్' అని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇక టీజర్‌కు ఎన్టీఆర్ వాయిస్ ఇచ్చిన విషయం తెలిసిందే! తారక్ వాయిస్‌తో తాజాగా విడుదలైన టీజర్‌మరింత పవర్ ఫుల్‌గా కనిపించింది. విజయ్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. ఆయన యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తానికి ఈ టీజర్‌తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారు. 'జెర్సీ' సూపర్ హిట్ తర్వాత గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కూడా సమ్‌థింగ్ స్పెషల్‌గా తెరకెక్కినట్లు టీజర్ చూస్తుంటే తెలుస్తోంది.

ఆదివారం వార్త

23 ఫిబ్రవరి, 2025

## మంచి ముత్యాలు

మన ఆత్మీయులెవరో తెలుసుకోవటానికే ఆపదలు కలుగుతూ ఉంటాయి. అపోహలు, అపనిందలు జీవన శిల్పానికి తుది మెరుగులు దిద్దే కళాకాంతులు. – కొల్లిపర పాండురంగారావు

సులభంగా వచ్చే ఫలితాల వ్యయం అధికంగా ఉంటుంది.

## కదంబం

'సంఘీ'భావం....5

శత్రు ఆస్తులపై కేంద్రం నజర్

కవర్ స్టోరీ..6

శివోహం..
జనోహం!

మోసం...11

ఈ వారం కవిత్వం...12

కలం

క్షయ నివారణ సాధ్యమేనా?.... 18

కథ..20

నెరవేరిన ఆశయం

సాహిత్యం.. 22

అధికార భాషగా తెలుగు

యువతలో విపరీత ధోరణి.. 26

ఇత్తడికి మరో పేరు అజ్జరం! 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## చిత్రమైన దీవి

పెద్ద పెద్ద దీవుల్లో అడవులు, జంతువులు ఉంటాయి. మనుషులూ జీవిస్తూ ఉంటారు. కానీ రోజులో కొంత సేపు మాత్రమే కనిపించి, ఆ తర్వాత మాయమైపోయే దీవి ఒకటి ఉంది. అది కూడా మన దేశంలోనే. మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లోని దేవ్ బాగ్ బీచ్‌కు సమీపంలో అరేబియా సముద్రంలో ఈ చిత్రమైన దీవి ఉంది. రోజులో సుమారు అరగంట పాటు మాత్రమే ఈ దీవి సముద్రంపైన కనిపిస్తుంది. మిగతా సమయమంతా సముద్రంలో మునిగిపోయే ఉంటుంది. ఈ దీవి పేరు 'సీగల్ ఐలాండ్'. ఈ దీవిని స్థానికంగా మినీ థాయిలాండ్ అని కూడా పిలుస్తుంటారు. రోజూ అరగంట సేపే కనిపించడం ఏమిటి? సముద్రంలో రోజూ రెండు సార్లు అలలు, నీటి మట్టం ఒకటి రెండు మీటర్లు ఎగిసిపడటం, తర్వాత సాధారణం కంటే ఒకటి రెండు మీటర్లు తగ్గిపోవడం తెలిసిందే. వీటినే సముద్రపు ఆటుపోట్లు అంటారు. చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి కారణంగా సముద్రంలో ఈ ఆటు పోట్లు ఎదురవుతూ ఉంటాయి. ఇలా సముద్ర మట్టం గరిష్టంగా తగ్గిపోయే సమయంలో... సముద్రం పైన తేలుతూ కనిపించే దీవి 'సీగల్ ఐలాండ్' ఆ పక్షులకు ప్రత్యేకం కావడంతో సముద్రంలో మునిగి, రోజులో కాసేపు బయటికి తేలే ఈ దీవిపై 'సీగల్స్'గా పిలిచే సముద్రపు పక్షులు చేరుతూ ఉంటాయి. వాటితో పాటు కొన్ని ఇతర రకాల పక్షులూ ఆ కాసేపు ఈ దీవిపై వాలుతాయి. ఇది చాలా చిత్రమైన సంగతి. సముద్రంలో మునిగి, తేలుతూ ఉండే ఈ దీవిని చూడటానికి, ఇక్కడి పక్షులను చూడటానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు. సరిగ్గా ఈ దీవి సముద్రం నుంచి బయటపడే సమయానికల్లా బోట్లలో దాని దగ్గరికి తీసుకు వెళుతూ ఉంటారు. విభిన్నమైన పర్యాటకాన్ని ఇష్టపడేవారు ఈ చిత్రమైన దీవిని సందర్శించేందుకు వెళ్లవచ్చు. దేవ్ బాగ్ బీచ్ నుంచి స్థానిక మత్స్యకారుల పడవలు, బోట్లలో దీవి వద్దకు వెళ్లవచ్చు. డిమాండ్‌ను బట్టి ఒక్కొక్కరి చార్జి వసూలు చేస్తారు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com







# యాపిల్ చిత్రాలు



మనలో
కాసింత కళా
హృదయం ఉండాలేగానీ..
కాగితాలు, కాన్వాస్ మీద
బొమ్మలేయడమే
కాదు.. దేన్నయినా
అందంగా తయారు చేయొచ్చు.
ఎర్రెర్రని యాపిల్‌పండు
భలే ఉంటుంది కదూ !
ఆ అందానికి చిత్రిక పట్టి..
ఎన్నో చిత్రాలు చేశారు కళాభిమానులు.
మనమూ ప్రయత్నిద్దాం మరి!








'సంఘీ' భావం



# శత్రు ఆస్తులపై కేంద్రం నజర్

దేశ విభజననతరువాత మననదేశంలో ఉన్న శత్రు ఆస్తులపై కేంద్రం దృష్టి సారించింది. 1965 నుంచి ఏ మేరకు శత్రు ఆస్తులు మననదేశంలో ఉన్నాయి, వాటి పరిస్థితి ఏమిటన్న అంశంపై సర్వేలు నిర్వహిస్తోంది. మరోపక్క రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులకు శత్రు ఆస్తులకు సంబంధించినవివరాలు సేకరించేందుకు బాధ్యతలను కేటాయించింది. 1968లో చేసిననచట్టానికి 2017లో సవరణలు చేయడంతో ప్రస్తుతం వాటిని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. దీనితో ప్రస్తుతం దేశవ్యాప్తంగా జోరుగా సర్వేలు నిర్వహిస్తున్నారు. 1962 చైనా దురాక్రమణ, 1965, 1971 ఇండో–పాకిస్థాన్ యుద్ధాల తరువాత చాలా మంది చైనాకు, పాకిస్థాన్‌కు వలసలు వెళ్లారు. ఇలా వెళ్లే సమయంలో వారికి చెందినన ఆస్తులు, భూములను వదిలిపెట్టారు. అయితే వారికి భూములు, ఆస్తులు ఉండటంతో వాటిని విక్రయించే అవకాశం లేకుండా పోయింది. 1968లో చట్టాన్ని రూపొందించి ఈ ఆస్తులు భారత శత్రు ఆస్తుల కస్టోడియన్ (సిఇపిఐ) ఆధీనంలో ఉంచారు. అయితే ఈ ఆస్తులననవిక్రయించేందుకు ఎలాంటి హక్కులు కల్పించలేదు. అదే విధంగా మననదేశంలో పౌరులు, రైతులు వాటిని ఆక్రమించకుండా ఈ సంస్థ పర్యవేక్షణ జరుపుతుంది. అయితే ప్రస్తుతం చాలా వరకు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయి. ముఖ్యంగా రైతులు ఈ భూములను స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం దేశంలో సుమారుగా 9,280 శత్రు ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇంకా సర్వే కొనసాగుతోంది.

భారత శత్రు ఆస్తుల కస్టోడియన్ (సిఇపిఐ) ఆధీనంలోని 996 కంపెనీలలో 20,323 మంది వాటాదారులు ఆరున్నర కోట్లకుపైగా షేర్లు కలిగి ఉన్నారు. వాటిలో 588 కంపెనీలు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. అయితే ఈ వాటాలు పూర్తిగా శత్రు దేశంలో స్థిరపడి అక్కడి పౌరసత్వం పొందిననవారివి కావడంతో వీటిని విక్రయించేందుకు కేంద్రం అనుమతి కావాలి. దేశ విభజన, చైనా దురాక్రమణ, ఇండో–పాకిస్థాన్ యుద్ధాల సమయంలో ఆయా దేశాల నుంచి కొందరు మననదేశానికి వచ్చి, ఇక్కడి పౌరసత్వం పొందారు. వారు కూడా తమ ఆస్తులననపాకిస్థాన్, చైనాలో వదిలివచ్చారు. వీరి ఆస్తులను అక్కడి ప్రభుత్వాలు శత్రు ఆస్తులుగా పరిగణించి వాటిని స్వాధీనం చేసుకుని విక్రయించడం కూడా చేసింది. ప్రస్తుతం మననదేశంలో ఇప్పుడిప్పుడే ఈ ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది. దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 4,991 ఆస్తులు ఉన్నట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 2,735, దేశ రాజధాని న్యూఢిల్లీలో 487 ఆస్తులు ఉన్నాయి. తెలంగాణలో దాదాపు 234 ఆస్తులు ఉన్నాయి. చట్ట నిబంధనల ప్రకారం శత్రు ఆస్తులకు స్థానికంగా ఎవరికీ హక్కులు ఉండవు. శత్రు దేశంలో ఉన్న వారి వారసులు ఇక్కడే ఉన్నప్పటికీ, వారికి కూడా ఈ ఆస్తులు వర్తించవు. అయితే చట్ట సవరణకు ముందు అహ్మదాబాద్ రాజు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని 936 ఆస్తులను తిరిగి తనకు స్వాధీనం చేయాలని న్యాయ పోరాటం జరిపాడు. దీనితో సుప్రీంకోర్టు ఆయనకు ఆస్తులు అప్పగించాలని తీర్పు ఇచ్చింది. లక్నోలోని కీలక ప్రాంతాల్లో ఉన్న ఆస్తులతో పాటు సీతాపూర్‌లోని ఎస్పీ నివాసం, డిఎం నివాసం, సిఎంఒ నివాసం, లఖింపూర్‌లోని ఎస్పీ నివాసం ఆయనకు దక్కాయి. దీనితో ప్రభుత్వం ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసింది. అనంతరం 2017లో చట్టానికి సవరణలు చేసింది. శత్రు దేశంలో నివాసం ఉంటున్న వ్యక్తుల పేర్లపై ఉన్న ఆస్తులకు వారి వారసులు మననదేశంలో ఉన్నా వాటిపై హక్కులు ఉండవని స్పష్టం చేస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఈ ఆర్డినెన్స్ చట్టసభల్లో ఆమోదం పొందింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఉన్న ఆస్తులకు సంబంధించి సర్వేలు పూర్తి చేసి వాటి పరిస్థితిపై ఒక నివేదికను రూపొందించే కార్యక్రమాన్ని చేపట్టింది. వివిధ రాష్ట్రాల్లో రెవెన్యూ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి వాటి వివరాలను సేకరిస్తోంది. సుమారు మూడు వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులుంటాయని ప్రాథమిక అంచనాల్లో తేలింది. అయితే వీటి మార్కెట్ విలువ అంతకు పది వంతులు ఉంటుందని భావిస్తోంది. ఈ ఆస్తులను ఇలానే వదిలేస్తే కొంత కాలానికి అన్నీ అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని కేంద్రం ఆందోళననవ్యక్తం చేసింది. అంతకుముందే ఈ భూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా వాటిని వేలం వేయాలని నిర్ణయించింది. వచ్చిననమొత్తంతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంటూ, ఆ దిశగా చర్యలు చేపట్టింది. అయితే రైతులు ఇప్పటికే ఆక్రమించుకుని వాటిలో పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం చట్ట నిబంధనల ప్రకారం వారి నుంచి ఈ భూములను స్వాధీనం చేసుకుంటే సన్నకారు రైతులు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని రెవెన్యూ అధికారులు కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. దీనితో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. శత్రు ఆస్తులకు మరో రెండు నెలల్లో ఒక కార్యాచరణ అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# శివోహం.. జనోహం!







**మాఘమాసం అనేక పుణ్యకార్యాలకి, విశేష ఫలప్రదమైన పండుగలకి ప్రసిద్ధి చెందిందని పురాణాల వల్ల తెలుస్తోంది. ఈ మాఘ మాస మహాత్మ్యం మొదట శివుడు పార్వతికి, ఆ తర్వాత నారదుని ద్వారా సూతునికి, సూతని ద్వారా ముని గణానికి తెలిసింది.**

మాఘమాసం విష్ణు ప్రీతికరమైనా పరమశివునికి అత్యంత ప్రతీకరమైన రోజు మహా శివరాత్రి ఈ మాసంలోనే వస్తుంది. “శివాయ విష్ణు రూపాయ, శివరూపాయ విష్ణవే” అన్నారు. అంటే ఇద్దరు అనుకునే శివకేశవులు ఒకటే అని అర్థం. ప్రతి మాసంలోనూ మాస శివరాత్రులు వస్తాయి. కానీ విష్ణు ప్రీతికర మాఘ మాసంలో వచ్చే మహా శివరాత్రి మహాత్మ్యం ఎంతో గొప్పది. మహా శివరాత్రి రోజున భక్తులు భోళాశంకరుని మీద భక్తితో తమ భక్తి విశ్వాసాలను ప్రకటించి ఉపవాసం, జపం, జాగరణలతో కాలం గడిపి తమకు సుఖ సౌఖ్యాలను ప్రసాదించాలని కోరుకుంటారు. శివుడు అభిషేక ప్రియుడు. నమక-చమకాలతో శివుడిని అభిషేకిస్తే సంతోషించి, కోరిన కోరికలు నెరవేస్తాడని ప్రతీతి.

## రాహు కేతు దివ్యక్షేత్రం-దక్షిణ కైలాసం

ముల్లోకాల్ని ఏలే దేవతల్లో శివయ్య భోళాశంకరుడు. సనాతుడు. భక్తజన వల్లభుడు, భూతనాథుడు, వైద్యనాథుడు, చరా చర జగత్తుకు ఆయనే విశ్వనాథుడు, చంద్రశేఖరుడు. భక్తితో కొలిచే తన భక్తులను సాక్షాత్కరించే శివయ్య దర్శనం సర్వపాప హరణం అంటారు. క్షీరసాగర మథనంలో అమృతం కంటే ముందు హాలాహలం పుట్టిన విషయం అందరికి తెలిసిందే. అది ముల్లోకాలను దహించి వేస్తుందన్న ప్రమాదం ఉండడంతో దేవదానవులందరు భీతావహులై తమను రక్షించాలంటూ పరమేశ్వరున్ని వేడుకోవడంతో లోకరక్షణార్థం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి గరళ కంఠుడుగా పేరు పొందాడు. ఈ హాలాహలం ప్రభావానికి ఆయన కంఠం నీలంగా మారడంతో నీలకంఠుడయ్యాడు.

శివ నామస్మరణ చేస్తూ భక్తితో ముక్తి కోసం మొకరిల్లే రోజు మహా శివరాత్రి. సాగర మథనంతో ఆవిర్భవించి సమస్త జగత్తును నాశనం చేసే కాలకూట విషాన్ని గొంతును దాచి సృష్టిని రక్షించిన భక్తవత్సలుడు సర్వేశ్వరుడు. ఆ సమయంలో సర్వేశ్వరునికి ప్రాణకోటి తనదైన రీతిలో నిరాజనాలు అందించింది. ఆ మహత్తర వేడుకే మహా శివరాత్రి. ఓం నమఃశ్శివాయ అంటూ శివపంచాక్షరి స్మరణతో మారుమోగే రాత్రి. భక్తితో బ్రహ్మమురారీ సురార్చిత లింగం/ నిర్మల భాసిత శోభిత లింగం/ జన్మజ దుఃఖ వినాశక లింగం తత్ప్రణమామి సదాశివ లింగం. బ్రహ్మమురారీ మున్నగు సురులు అర్చించిన నిర్గుణ, నిరాకార లింగమూర్తి శివుడు.

## పంచభూత లింగాల్లో శ్రీకాళహస్తి ప్రత్యేకం

పంచభూత లింగాల్లో నాలుగు తమిళనాడులో వుండగా, ఒకటి మాత్రం నవ్యాంధ్రప్రదేశ్‌లో వెలసింది. భారతదేశంలోని అనేక పుణ్యక్షేత్రాల్లో శ్రీకాళహస్తి మహాక్షేత్రం పరమ పవిత్రమైందిగా ప్రసిద్ధి చెందింది. దక్షిణ కైలాసంగాను, సత్యవ్రత మహా భాస 2ర క్షేత్రంగా, శివా నందైక నిలయంగాను అనేక నామాంతరాలతో ప్రసిద్ధి చెందింది. పంచ భూత లింగాల్లో మనిషికి ఆయువు అయిన వాయుక్షేత్రంగా విరాజిల్లుతోంది. మిగిలిన నాలుగు లింగాలు జంబుకేశ్వరంలో జలలింగంగా, తిరువణ్ణామలైలో తేజోలింగంగా, చిదంబరంలో ఆకాశలింగంగా, కంచిలో పృథ్వీలింగంగాను వెలసినట్లు పురాణాల్లో ఆధారాలు ఉన్నాయి. ఈ శ్రీకాళహస్తి దివ్యక్షేత్రానికి పడమరగా ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖీనది బ్రహ్మదేవుని వరప్రసాదంచే అగస్త్యముని తపఃప్రభావంతో దక్షిణ కైలాసం అనే కొండల్లోంచి పుట్టినట్లు స్థల పురాణం వల్ల తెలుస్తోంది.

**కవర్ స్టోరీ**

ఎస్.రహంతుల్లా,
స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాళహస్తి

సర్వేశ్వరుడు సృష్టికర్త బ్రహ్మను పిలచి కైలాసంను సృష్టించమని ఆదేశించగా బ్రహ్మ కైలాసాన్ని సృష్టించే సమయంలో తడబాటులో కొంత భాగం భూమిపై పడిందనీ, ఆ భాగమే దక్షిణ కైలాసంగా పిలవబడుతున్న శ్రీకాళహస్తి దివ్య క్షేత్రంగా చెబుతారు. మూడు మూగజీవాల భక్తి, ఆరాధనల ఫలితంగా ఏర్పడినదే శ్రీ(సాలెపురుగు), కాళ(పాము), హస్తి(ఏనుగు).

## మూగజీవులకు ముక్తినిచ్చిన దివ్యక్షేత్రం

పూర్వ జన్మలో సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నందున బ్రహ్మదేవుని శాపానికి గురైన ఊర్ణనాభుడనబడే శిల్పి భూలోకాన సాలీడుగా

జన్మించి మారేడు పత్రాల మధ్య జీవిస్తూ ఉండినట్లు స్థల పురాణంలో పేర్కొన్నారు. ఈ వృక్షం కింద మరో ఇతివృత్తంలో శాపం వల్ల శివుని మెడలోని పాము భూలోకంలో దక్షిణ కైలాసంలో అడవిలో జన్మించి బిల్వ వృక్షం కింద వెలసిన శివలింగాన్ని అర్చించినట్లు ప్రతీతి. హస్తి అనే శివకింకరులు తాము చేసిన అపరాధ ఫలితంగా భూలోకంలో శాపం వల్ల గజరాజుగా జన్మించి అదే బిల్వవనంలో నివసిస్తూ పాము పూజిస్తున్న శివలింగాన్నే తాను కూడా పూజిస్తున్నట్లు చెబుతారు. పాము చేసిన అలంకారాలను తొలగించి తొండంతో స్వర్ణముఖీనది జలాన్ని తెచ్చి అభిషేకిస్తూ కాలం సాగదీస్తున్నట్లు కథాంశం. ఏనుగు తాను చేసిన అలంకారాలను తీసేయడాన్ని చూసి ఆగ్రహించిన పాము ఒకరోజు శివలింగానికి సమీపంలో ఉండి అభిషేకం చేస్తున్న గజరాజు తొండంలో దూరి కుంభస్థలంలో అలజడి కలిగించగా ఆ బాధ భరించలేని గజరాజు తన తలను ఓ బండకు మోదుకుని మరణించాడు. గజరాజుతో పాటు కుంభ స్థలంలో ఉన్న పాము కూడా మృతి చెందింది. అప్పుడు శివుడు ప్రత్యక్షమై వారిరువురికీ పూర్వ జన్మ వృత్తాంతం తెలిపి, వారిని అనుగ్రహించి శివైక్యం గావించాడు. ఆ విధంగా శ్రీకాళహస్తి అనే పేరు వచ్చింది.



## భక్తకన్నప్ప వృత్తాంతం


శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో మరో మహాభక్తుడు తిన్నడు (భక్తకన్నప్ప) శివసాయుద్యం పొందాడు. ఆటవిక రాజైన తిన్నడు పూర్వ జన్మలో పాండవ మధ్యముడైన అర్జునుడు. అతనిని పరీక్షించాలని శివుడు పార్వతీ సమేతంగా బోయ రూపంలో వచ్చి పరీక్షించగా అందులో అర్జునుడు విజయం సాధిస్తాడు. శివుడు సంతోషించి ఇచ్చిన వర ఫలితంగా అర్జునుడు మరో జన్మలో తిన్నడుగా జన్మించాడు. జంతువులను వేటాడుతూ తిరుగుతున్న తిన్నడికి బిల్వ వనంలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనమైంది.
లింగ రూపుడైన పరమేశ్వరునికి ప్రతిరోజూ తాను వేటాడిన జంతువుల మాంసాన్ని నైవేద్యంగా సమర్పించేవాడు. అక్కడే పూజలు జరుపుకున్న బ్రాహ్మణుడు భిన్నుడై ఇదేమి అపవిత్రమని శివున్ని ప్రార్థించగా శివుడు అశరీర వాణిగా తిన్నని వృత్తాంతాన్ని ఆ బ్రాహ్మణునికి తెలియజేశాడు. తిన్నని భక్తిని పరీక్షించటానికి శివుడు తన శివలింగంలోని కళ్ల నుంచి ధారగా రక్తం కారుతున్న దృశ్యాన్ని సృష్టించాడు. భిన్నుడైన తిన్నడు తన కళ్లను తీసి శివలింగానికి అమర్చాడు. అతని భక్తిశ్రద్ధలకు ముగ్ధుడైన శివుడు తిన్ననికి శివసాయుధ్యాన్ని ప్రసాదించినట్లు క్షేత్ర మహిమలో ఉంది.

## రాహు-కేతు నిలయం

మహా శివరాత్రి అంటే భక్తులకు గుర్తుకొచ్చేది శివాలయాలు. మహాదేవునికి దేశవ్యాప్తంగా ఎన్నో ఆలయాలున్నాయి. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం దక్షిణ భారతదేశంలోని నవ్యాంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వ రాలయం. ఇటు తమిళనాడుకు, అటు కర్ణాటక రాష్ట్రానికి చేరువలో ఉండటంతో ఈ క్షేత్రానికి రాష్ట్రం నుంచి వచ్చే భక్తులే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ దివ్యక్షేత్రం ముక్తి ప్రధాన క్షేత్రం. మూగజీవులకు మోక్షమిచ్చిన ముక్తిధామం అని చెప్పవచ్చు.
ఈ క్షేత్రంలో రాహు, కేతు పూజలు విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ముల్లోకాలు శివుని ఆజ్ఞ ప్రకారం నడుస్తున్నాయన్నది పెద్దల నమ్మకం.
సప్త ధాతువులతో ఏర్పడింది శరీరం. నవగ్రహాల అధిపతులు సూర్యుని నుంచి శని వరకు సరిపోయారు. రాహు-కేతువు అనే రెండు గ్రహాలకు స్థానం లభించలేదు. మరి అవి ఎలా సంచరిస్తున్నాయి? వాటి స్థానం ఏమిటన్నది ప్రశ్నార్థకం. అవి శివుని ఉచ్ఛ్వాస, నిశ్వాసలో ఉన్నాయని చెబుతారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శివుడు వాయులింగేశ్వరుడు, గర్భాలయంలోని ఎడమవైపు రెండు దీపాలు కనిపిస్తాయి. వీటిని వాయు దీపాలుగా, స్వామి ఉచ్వాస, నిశ్వాసలకు ప్రతీకగా స్థలపురాణం చెబుతుంది. నవగ్రహాలు, 27 నక్షత్రాల సౌరమండలం శివుని ఆజ్ఞతో నడుస్తుంటాయి. కాబట్టి రాహు-కేతువులు కూడా ఆయన కన్నుల్లోనే ఉంటాయి. ఈ దోషం ఉన్నవారు వాయులింగేశ్వరుడుగా స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శించి మొక్కితే గ్రహదోషం పోతుందని చెబుతారు. పురాణాలలో పేర్కొనడమే కాక సర్పదోషం, రాహు-కేతు దోషం ఉన్నవారు దక్షిణ కాశిని సందర్శిస్తే దోష నివారణ అవుతుందనడంలో సందేహం లేదు.

## ప్రత్యేకమైన లింగాకృతి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయు లింగేశ్వరుని లింగాకృతిలో ఓ ప్రత్యేకత ఉంది. ఈ లింగాకృతి షణ్మాతాలకు ప్రతీకగా మిళితమై వెలసింది. ఈ ఆకృతిని



క్షుణ్ణంగా పరిశీలిస్తే పానవట్టం శక్తికి నిదర్శనంగా ఉంది. అంటే శైవానికి నిదర్శనం. లింగం పైభాగంలో గల ఐదు శిరస్సుల ఆకృతి కౌమారంగాను, సుబ్రహ్మణ్యం స్వామి మధ్యలో ఏనుగు దంతాలు (గణపత్యాంకు నిదర్శనంగా కను ్న (భక్తకన్నప్ప సమర్పించిన) సౌరంగాను, 'శ్రీ' సాలెపురుగు (లక్ష్మీదేవి) వైష్ణవానికి నిదర్శనంగా చెబుతారు.

కాబట్టి స్వయంభువు షణ్ముతాలకు ప్రతీకగా చెబుతారు. లింగాకృతిని శివశక్తుల ఐక్యరూపంగా చెబుతారు. మూల విరాట్టుకు పక్కన వున్న రెండు దీపాలను వాయుదీపాలంటారు. అక్కడ నుంచి బయటకు వస్తే భక్తకన్నప్ప గంభీరంగా ఉండే రాతి విగ్రహం పక్కనే స్వామి అయ్యప్ప తరువాత వల్లభ గణపతి, లక్ష్మీ గణపతి, శక్తి గణపతి విగ్రహాలున్నాయి. వీటిని రాయలసీమ పరిపాలించిన శ్రీకృష్ణ దేవరాయలు ప్రతిష్టించినట్లు చెబుతారు. అలాగే సుమారు అర డజను శివలింగాలు ఉన్నాయి. వీటిలో సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు, సప్తరుషులచే ప్రతిష్టిత లింగాలున్నాయి. ఈ ప్రదేశంలోనే కనకదుర్గ అమ్మవారి సన్నిధి, ఆ పక్కనే నటరాజస్వామి నిలువెత్తు పంచలోహ విగ్రహం, ఆ పక్కనే 63 మంది శివభక్తులైన నాయనార్లు, కాలభైరవుని సన్నిధి, సప్తమాతృకలు వెలసి, భక్తుల కోర్కెలను తీరుస్తున్నారు.



పార్వతీదేవి ఇక్కడ తపస్సు చేసి జ్ఞానం పొందింది కాబట్టి జ్ఞానప్రసూనాంబగా వెలసినట్లు చెబుతారు. అమ్మవారి విగ్రహ పాదాల చెంత శంకర భగవత్పాదులు ప్రతిష్టించిన అర్థమేరు వుంది. ప్రతి శుక్రవారం జరిగే ఉత్సవాల్లో అమ్మ వారికి అలంకరించే బంగారుచీరె ప్రత్యేక అలంకారంగా చెప్ప వచ్చు. అమ్మవారి గర్భాలయ ప్రవేశానికి ముందు కూరగాయల రంగులతో ఆలయ ఛత్రంలో రాశిచక్రం చూడదగినది. వంద సంవత్సరాలైనా ఇది చెక్కు చెదరక ఉండడం గమనార్హం. ఆ తరువాత చిత్రగుప్తుడు, యముడు, ధర్మరాజు, వ్యాసుడు మొదలైన వారిచే ప్రతిష్టించే శివలింగాలు, చండీకేశ్వరుని ఆలయం దర్శించుకోవచ్చు. తరువాత జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల వారిచే ప్రతిష్టించబడిన స్ఫటిక లింగం ఆలయ అపురూపాల్లో ఒకటిగా చెప్పవచ్చు. దాని పక్కనే సాలెపురుగు, ఏనుగు, పాము కన్నప్పల రాతి విగ్రహాలున్నాయి. చిట్టచివరిగా దక్షిణామూర్తిని దర్శించుకొని బయటకు రావచ్చు.

మానవుని మనుగడకు పంచభూతాలు ఎంతో అవసరం. వీటి గమనంతోనే మన మనుగడ సాధిస్తూంటుంది. నింగి, నేల, గాలి, నీరు, నిప్పు పంచభూతాలుగా ఉన్నాయి.

## చిదంబరంలో ఆకాశలింగం

పంచభూత లింగాల్లో ఒకటైన ఆకాశలింగం తమిళనాడులోని కడలూరు జిల్లా కారేకల్‌కు ఉత్తరంగా 60 కి.మీ దూరంలో చిదంబరం నడిబొడ్డున ఆకాశ లింగం వెలసింది. తమిళ సంఘం సాహిత్య రచనల ప్రకారం సనాతన విశ్వకర్మల వంశస్తుడైన విదువేల్విడుగు పెరుషత్తాన్ ఈ ఆలయ పునః సృష్టికి ప్రధాన రూపకల్పిగా చెబుతారు. చోళ, పల్లవ రాజుల కాలంలో ఈ ఆలయం జీర్ణోద్ధరణ జరిగినట్లు ప్రసిద్ధి.

హిందూ సాహిత్యం ప్రకారం చిదంబరం అనేది శివుని ఐదు పవిత్రమైన ఆలయాల్లో ఒకటిగా వెలసింది. నలభై ఎకరాల వైశాల్యంలో శైవ, వైష్ణవ సాంప్రదాయాలతో వెలసిన అతి కొద్ది దేవాలయాల్లో ఇది ఒకటి. క్రీ.శ 1213లో ఈ ఆలయాన్ని పునః నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శివుడు ఆనంద తాడవం భంగిమలో వెలసి భక్తులకు వరాలిస్తున్నాడు.

## కంచిలో ఏకాంబరేశ్వరుడు

పంచభూత లింగాల్లో మరొక లింగం పృథ్వీలింగం. ఈ క్షేత్రం తమిళనాడులోని కాంచీపురంలో వెలసింది. చెన్నైకి సుమారు డెబ్బై కిలోమీటర్ల దూరంలో వుందీ క్షేత్రం. ఈ దేవాలయం గోపురం ఎత్తు యాభై తొమ్మిది మీటర్లు. భారతదేశంలోని అతిపెద్ద గోపురాల్లో ఇది ఒకటి. ఇక్కడ వెలసిన స్వామి ఏకాంబరేశ్వరుడు. ఈ ఆలయం నిర్మాణం ప్రత్యేక శైలిలో ఉంటుంది. ఇక్కడ వెలసిన ఏకాంబరేశ్వరునికి నాలుగు వైపులా నాలుగు గాలిగోపురాలు ఉన్నాయి. ఒక్కో గాలిగోపురం ఎత్తు 57 మీటర్లు. దేవాలయం లోపలి మండ పంలో వెయ్యి స్తంభాలు, 1008 శివలింగాలు ప్రతిష్టింపబడి ఉన్నాయి. ఈ దేవాలయంలో సుమారు 3,500 సంవత్సరాలు వయస్సు కలిగిన మామిడి చెట్టు ఉంది. ఈ చెట్టులోని నాలుగు కొమ్మలు నాలుగు రకాల రుచిగల పళ్లు కాస్తాయి. సంతానం లేనివారు ఈ చెట్టుకింద పడిన పండు సేవిస్తే సంతానం కలుగుతుందని ప్రజల నమ్మకం. ఈ చెట్టునీడలో ప్రస్తుత నిర్వాహకులు మరో కొత్త మామిడి వృక్షం నాటారు. పురాతన మామిడి వృక్షం కాండాన్ని అద్దాల పెట్టెలో ఉంచి దేవాలయంలో భద్రపరచారు. ఈ మామిడి వృక్షం కింద పార్వతీ పరమేశ్వరులు, పార్వతీదేవి కుమార స్వామిని ఒడిలో కూర్చోబెట్టుకుని వధూవరులుగా దర్శనమిస్తారు.

## జంబుకేశ్వరంలో జలలింగం

పంచభూతాల్లో రెండవది జంబుకేశ్వరం. తమిళనాడులోని తిరుచ్చికి 11 కి.మీ దూరంలో ఉంది జంబుకేశ్వరం.





స్థల పురాణం ప్రకారం ఇక్కడ స్వామి ఏనుగుల చేత పూజలందుకు న్నట్లుగా పేర్కొన్నారు. ఈ క్షేత్ర స్థానంలో పూర్వం జంబువృక్షాలు ఉండడం వల్ల దీనికి జంబుకేశ్వరం అనే పేరు వచ్చింది. జంబు వృక్షాలు అంటే నేరేడు అని అర్థం. ఇక్కడి దేవాలయం విశాలమైన ప్రాకారంతో ఎత్తైన గోపురాలతో వెలసింది. ఐదు ఎకరాల విస్తీర్ణంతో ఐదు ప్రాకారాలు కలిగి ఉంది. ఆలయానికి మొత్తం 7 గోపురాలు ఉన్నాయి. జంబు కేశ్వర స్వామి పశ్చిమాభి ముఖంగా వెలసి ఉన్నారు. గర్భగుడి పక్కనే అఖిలాండేశ్వరి ఆలయం ఉంది. జంబుకేశ్వరుడుగా పేరుపొందిన ఇక్కడి లింగం నీటితో నిర్మితమైంది. కానీ నీటిలో లేదు. లింగం పానవట్టం నుండి ఎప్పుడు నీరు ఊరుతూ ఉంటుంది. ఈ అంశాన్ని భక్తులకు చూపించేం దుకు లింగం పానవట్టంపై ఒక వస్త్రం కప్పుతారు. గర్భగుడిలో గవాక్షానికి నవ ద్వారగవాక్షం అని చెబుతారు. ఈ ఆలయాన్ని క్రీ.శ 11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లు ఆతర్వాత పల్లవరాజులు, పాండ్యులు, విజయనగర రాజులు జీర్ణోద్ధరణ చేసినట్లు తెలుస్తోంది. నాయనార్లలో ప్రసిద్ధుడైన సుందర్ సంబందర్ తదితరులు స్వామిని సేవించి తరించినట్లు చెబుతారు.



## తిరువణ్ణామలైలో అగ్నిలింగం

పంచభూతలింగాల్లో మూడోదైన తేజోలింగం తమిళనాడులోని తిరువణ్ణామలైలో వెలసింది. ఇది జిల్లా ప్రధాన కేంద్రంలోని మున్సిపాలిటీలో ఉంది. అన్నామలై కొండ దిగువన ప్రాంతంలో ఉన్న అన్నా మలైయర్ గుడి తిరువణ్ణా మలైలోనే ఉంది. తిరువణ్ణామలై చెన్నైకి 185 కిలోమీటర్లు, బెంగళూరుకు 210 కి.మీ దూరంలో ఉంది. తెన్‌పేనై నది మీద ఉన్న శాతమూడు డ్యాం పర్యాటక ప్రదేశం. ఈ ఆలయం తమిళనాడులోని శైవ క్షేత్రాల్లో ఒక గొప్ప క్షేత్రంగా విరాజిల్లు తోంది. ఈ దివ్య క్షేత్రం యోగులకి, సిద్ధులకి నిలయంగా ఉంది. 20వ శతాబ్దపు గురువులలో ఒకరైన రమణమహర్షి కూడా అరుణాచలేశ్వరం



కొండ మీద ఉండేవారు. ఈ క్షేత్రంలో ఏడాదికి నాలుగుసార్లు బ్రహ్మోత్స వాలు జరపడం ఆనవాయితీ. తమిళనెల కార్తికంలో జరిగే బ్రహ్మోత్సవాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. పది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు కార్తిక దీపంతో ముగుస్తాయి. ఆ రోజు సాయంత్రం అన్నామలై కొండమీద సుమారు మూడు టన్నుల నెయ్యి వేసి జ్యోతిని వెలిగిస్తారు. ప్రతి పౌర్ణమి రోజున వేలకొలది భక్తులు అరుణాచల కొండ చుట్టు పాదరక్షలు లేకుండా గిరి ప్రదక్షిణ చేసి శివున్ని ఆరాధిస్తారు. ఈ ప్రదక్షిణ దూరం 14 కిలోమీటర్లు. చైత్ర పౌర్ణమి రోజున ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు ఈ పుణ్య క్షేత్రాన్ని దర్శిస్తారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో మహా శివరాత్రి సంద ర్భంగా విశేష సంఖ్యలో ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఇందులో ప్రముఖంగా..

**శ్రీశైలం:** శ్రీశైలం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఉన్న ప్రసిద్ధ శైవ క్షేత్రం. ఈ దివ్య క్షేత్రంను ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు, చాణుక్యులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగరరాజులు, శివాజీ మహారాజ్ వంటి ఎందరో పురాణపురుషులు పూజలు చేసిన మల్లికార్జునుని పవిత్ర ధామం. ఈ దివ్యక్షేత్ర రక్షణ కోసం కొందరు రాజులు కోట లాంటి పటిష్ట కట్టడాలను నిర్మించారు. నాలుగు వైపులా నాలుగు పెద్ద ద్వారాలు, నాలుగు గోపురాలు, అద్భుత శిల్ప కళానైపుణ్యంతో నిర్మించారు. ఈ ఆలయంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారు ఎంతో ప్రసిద్ధి. 12 జ్యోతిర్లింగాల్లో శ్రీశైల దివ్యక్షేత్రం రెండవది. ఈ క్షేత్రంలో శిఖర దర్శనంతో పునర్జన్మ లేని ముక్తి లభిస్తుందని స్థల పురాణం చెబుతుంది.

**మహానంది:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో వెలసిన మరో మహా ప్రసిద్ధ క్షేత్రం మహానంది. నంద్యాలకు 14 కిలోమీటర్ల దూరంలో వెలసింది. ఇక్కడ వెలసిన స్వామి మహానందీశ్వరుడు, అమ్మవారు కామేశ్వరీ దేవి. ఈ దేవాలయం 7వ శతాబ్దం, బాదామి చాళుక్య చక్రవర్తి, విక్రమాదిత్యుని పాలనా కాలం నాటిదని చారిత్ర ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ శివలింగం ఎత్తు కొంత తక్కువగా ఉంటుంది. ఇక్కడ బ్రహ్మ, విష్ణు, రుద్ర గుండాలున్నాయి. ఈ ఆలయానికి సుమారు ఇరవై కిలోమీటర్ల దూరంలో 9నంది ఆలయాలు ఉన్నాయి. వీటిని నవ నందులని అంటారు. గర్భాలయం పక్కన ఒక శిలా మండపం ఉంది. ఇది నవీన కాలంలో చెక్కిన శిల్పాలు, ఈ శిలా స్థంబాలపై శిల్పి తన తల్లిదండ్రుల శిల్పాలను చెక్కి వారిపై తన ప్రేమను చాటుకున్నాడు. అలాగే స్థంభాలపై 'గాంధీ మహాత్ముని ప్రతిమ, ఇందిరాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల ప్రతిమలను చెక్కి తన దేశ భక్తిని చాటుకున్నాడు.

## వేములవాడ రాజరాజేశ్వరుడు

తెలంగాణలోని ప్రముఖ శివాలయాల్లో వేములవాడ ఒకటి. ఈ దివ్య క్షేత్రం కరీంనగర్ జిల్లాలో ఉంది. పురాతనమైన ఈ ఆలయం చాణుక్యుల కాలం నుంచి ఉందని పురాతన ఆధారాలనుబట్టి తెలుస్తోంది. పశ్చిమ చాణుక్యులు నిర్మించిన రాజరాజేశ్వరీ ఆలయం వేములవాడగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన మొదటి నరసింహునికి రాజ్యాధిక్య అనే బిరుదు ఉండేది. ఈ బిరుదును అనుసరించి ఆయన నిర్మించినట్లు చెబుతున్న ఆలయానికి ఆ పేరు వచ్చిందని అంటారు. ఆలయానికి ఉత్తరాన ధర్మగుండం అనే కోనేరు ఉంది. మహా శివరాత్రి పర్వదినాన లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు.



వంద మంది అర్చకులతో మహా లింగార్చన నిర్వహి స్తారు. అర్ధరాత్రి వేళ శివయ్యకు ఏకాదశ రుద్రాభిషేకాన్ని జరుపు తారు. చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరులను పావనం చేసిన తరువాత శివుడు వేములవాడకు వచ్చారని అంటారు.

**ద్రాక్షారామం:** తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షారామం సుప్రసిద్ధ శైవ క్షేత్రం. ఇక్కడ వెలసిన మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం అతి ప్రాచీనమైనది. ఈ ఆలయాన్ని క్రీ.శ. 7,8 దశాబ్దాల మధ్య తూర్పు చాణుక్యుల వంశానికి చెందిన చాణుక్య భీములు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ మూల విరాట్టు భీమేశ్వరస్వామి స్వయంభువుగా వెలసినట్లు చెబుతారు. ఇక్కడ శివలింగం 14 అడుగుల ఎత్తు. శుద్ధ స్ఫటికాకారం. దేవేరి మాణిక్యాంబ అమ్మవారు. భారతదేశంలో ప్రసిద్ధి చెందిన అష్టాదశ శక్తి పీఠాల్లో 12 వ శక్తి పీఠంగా వెలసింది. మన రాష్ట్రానికి త్రిలింగ దేశమనే పేరు రావటానికి కారణమైన క్షేత్ర త్రయంలో ద్రాక్షారామం ఒకటి. మిగిలిన రెండు క్షేత్రాలు కరీంనగర్‌లోని కాళేశ్వరం కాగా, మరొకటి శ్రీశైలం.

ఈ దివ్య క్షేత్రానికి సంబంధించి స్థల పురాణంలో పూర్వం తారకాసురుడనే రాక్షసుడు శివుని గురించి తపస్సు చేయగా పరమేశ్వరుడు సాక్షాత్కారించాడు. తారకాసురుడు శివుని ఆత్మలింగాన్ని వరంగా కోరగా శివుడు ప్రసాదించినట్లు చెబుతారు. దాంతో తారకాసురుడు దేవతలను రుషులను పలు ఇబ్బందులు పెడుతుండగా వారు విష్ణుమూర్తిని ఆశ్రయించగా ఆత్మలింగం తొలగితే తప్ప ఆ రాక్షసుని శక్తి నశించదని ఈశ్వరుని అంశతో జన్మించిన వారితో తప్ప మరెవ్వరి వల్ల మరణం లేనట్లు వరం పొందినట్లు చెబుతారు. మన్మథ ప్రేరణ చేత పార్వతీ కళ్యాణం కుమార సంభవం జరగగా ఆ కుమారస్వామి రుద్ర గణాలకు నాయకత్వం వహించి తారకాసురునితో యుద్ధం చేయగా కుమారస్వామి విసిరిన బాణం ఆత్మలింగానికి తగిలి ఐదు ముక్కలై భూమి మీద ఐదు చోట్ల పడ్డాయనీ, అవే పంచారామాలుగా వెలసినట్లు చెబుతారు. అవే ద్రాక్షా రామం, భీమారామం, క్షీరారామం, కుమారరామం, అమరారామంగా ప్రఖ్యాతి చెందాయి.



**కాళేశ్వరం:** కరీంనగర్ జిల్లాలోని సుప్రసిద్ధమైన ఆలయం కాళేశ్వరాలయం. త్రిలింగమనే మూడు సుప్రసిద్ధమైన శైవ క్షేత్రాల్లో కాళేశ్వరం ఒకటి. త్రిలింగాల నడుమ ఉండే ప్రాంతం కనుక త్రిలింగమనే పేరు వచ్చింది. ఈ దేవాలయంలో ఒకే పానవట్టంపై శివుడు, యముడు వెలిసారు. కరీనంనగర్ జిల్లాలోని మహాదేవ్‌పూర్ మండలానికి 16 కి.మీ. దూరంలోని మహారాష్ట్ర సరిహద్దులోని సిరోంచ తాలుకా సమీపంలో ఈ దివ్యక్షేత్రం ఉంది. గోదావరి నది ఒడ్డున ప్రాణహిత నదులతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహించటం వల్ల దీనికి త్రివేణి సంగమం అనే పేరు కూడా వచ్చింది. ఏ శైవ క్షేత్రంలో అయినా ఒక పానవట్టం మీద ఒక లింగం వుండడం ఆనవాయితి. కానీ కాళేశ్వరంలో మాత్రం రెండు శివలింగాలు ఉండటం విశేషం. మొదటిది కాళేశ్వరుడు, రెండవది ముక్తీశ్వర లింగం. ముక్తీశ్వర లింగానికి రెండు నాసికా రంధ్రాలున్నాయి. ఈ రంధ్రాల్లో ఎంత నీరు పోసినా పైకి రావని చెబుతారు. ఇవే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లో కోటప్ప కొండ, కీసరగుట్ట ఇలా.. ఎన్నో శైవ క్షేత్రాలు ఉన్నాయి.

**కోటప్ప కొండ:** గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపంలోని కొండపై కోటప్ప కొండ ఉంది. ఇది త్రికోటేశ్వరుని సన్నిధి.



త్రికూట పర్వతం అనే కొండపై మూడు పాయలుగా కొండ కనబడుతుంది. మొదటి కొండపై మునలికోటయ్య గుడి, రెండవ కొండపై త్రికోటేశ్వరాలయం దేవాలయం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తోంది. పరమశివుడు బ్రహ్మను త్రికూటాచలానికి వస్తే జ్ఞానం ప్రసాది స్తామనగా బ్రహ్మదేవుడు అక్కడకు వచ్చి శివుని నుంచి జ్ఞానోపదేశం పొందారట.

## సంగమేశ్వరాలయం

సప్త నదుల్లో కొలువుదీరిన సంగమేశ్వరుని ఆలయం ఎంతో పవిత్రమైనది. వేల సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయం. కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు పట్టణానికి సుమారు 20 కి.మీల దూరంలో కృష్ణా నదిలో సంగమేశ్వరాలయం ఉంది.

**కాశి:** ఇప్పుడు వారణాసిగా ప్రసిద్ధి చెందిన దివ్య క్షేత్రం కాశి. కాశీ లేదా వారణాసి భారతదేశంలో అతి ప్రాచీన నగరం. ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది వారణాసి. ఇటీవల ఈ ఆలయాలను ప్రభుత్వం ఆధునీకరించింది. భారతదేశ నలుమూలల నుంచి ఇక్కడికి ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. హిందువు లకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రమిది. ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా ఈ క్షేత్రాన్ని దర్శించాలని కోరుకుటారు. ప్రతి నిత్యం సాయంత్రం జరిగే గంగాహారతి దర్శించ దగిందీ. కాశీ అన్న స్మరణ తోనే జీవితం ధన్యమవు తుందని అంటారు. ఇది ఉత్తరప్రదేశ్‌లో ఉంది. కాశీ విశ్వేశ్వరుని దర్శించుకొని గంగా నదిలో స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగి పునర్జన్మ నుంచి విముక్తులౌతారని ప్రతీతి. ✦



# మోసం

సింగిల్ పేజీ కథ

నరెద్దుల రాజారెడ్డి

**"చింటూ,** మీ మామగారు వచ్చారు పలకరించావా?" సెల్ ఫోన్ పట్టుకుని కూర్చున్న కొడుకును అడిగాడు మాధవరావు.

సమాధానం రాలేదు.

"నిన్నేరా అడుగుతోంది" కాస్త గట్టిగా అన్నాడు.

"అబ్బా! ఏంటి నాన్న నీ గోల? వస్తే వస్తాడు ఇప్పుడు నన్నేం చేయమంటావ్" చింటులో చిరాకు.

"ఇంటికొచ్చిన బంధువుల్ని పలకరించాలి కదా!" అన్నాడు మాధవరావు. "నీ వల్ల నేను గేమ్ ఓడిపోయాను ఛీ" కోపంతో సెల్ ఫోన్ పక్కన పెట్టి బయటికి నడిచాడు చింటు.

"ఏంటో! ఈ కాలం పిల్లలకు అస్తమానం సెల్ చూడ్డం తప్ప మరో ధ్యాస వుండి చావదు" నిరుత్సాహం వ్యక్తపరిచాడు మాధవరావు

"వెనుకటి రోజులే బాగున్నాయి అనిపిస్తుంది ఈ సోషల్ మీడియా ఎక్కువైపోయాక బంధాలు బంధుత్వాలు అన్ని కనుమరుగైపోయి కొత్త కొత్త స్నేహాలు పెరిగిపోయాయి" అన్నాడు చింటు మామగారు రాఘవ. "ఎవరింట్లో చూసినా ఎవరి సెల్ ఫోన్‌లో వాళ్లు బిజీ ఐపోయారు మాటామంతీ లేదు" అన్నాడు మాధవరావు. అంతలో కాఫీ కప్పులతో అక్కడికి వచ్చింది మాధవరావు భార్య లీలావతి "పిల్లలకి సెల్ ఫోన్ అలవాటు చేసిందే మనం. వారి చేతికి సెల్ ఫోన్ ఇస్తే అసలు పని పక్కన పెట్టి గేమ్‌లు ఆడుకుంటున్నారు వారికి అస్తమానం సెల్ ధ్యాస తప్ప మరో ఆలోచన వుండదు" చిరు కోపంతో అంది లీలావతి.



.........

కొన్నాళ్ళు గడిచిపోయాయి. చింటూ కాలేజ్‌లో జాయిన్ అయ్యాడు. సెల్ ఫోన్‌పై మోజు మరింత పెరిగింది. కొత్త కొత్త స్నేహాలు బలపడ్డాయి. తను ఏం పని చేస్తున్నా సెల్ మాత్రం చేతిలోనే పెట్టుకుని చేసేవాడు "ఒక్క పూట భోజనమైనా తప్పిస్తాడుగానీ సెల్ ఫోన్ మాత్రం అర క్షణం కూడా వదలడు" అంటూ లీలావతి కొడుకును అప్పుడప్పుడు దండిస్తుండేది. ఒకరోజు అనుకోకుండా కొత్త నంబర్ నుంచి మాధవరావుకు కాల్ వచ్చింది "మీ నంబర్ పైన లాటరీ పద్ధతిలో యాభై వేలు లోను వచ్చింది మేం ఇచ్చిన లింకు ఓపెన్ చేసి మీకు మెసేజ్‌లో వచ్చిన నాలుగు అంకెల ఓటిపి చెప్తే మీ అకౌంట్‌లో డబ్బు జమ చేస్తాం" అంటూ ఒక అపరిచిత వ్యక్తి చెప్పేసరికి చదువు పెద్దగా లేని మాధవరావు నమ్మేసాడు. విషయం భార్యతో చెప్పి చంకలు గుద్దుకున్నాడు "అవన్నీ నమ్మకండి, మోసం చేస్తారు. మనం ఎవరో తెలియకుండా లోన్ ఎలా ఇస్తారండి? మీ పిచ్చి కాకపోతే" అంటూ లీలావతి ఒకే మాటలో కొట్టిపారేసింది. ఐనా పట్టించుకోలేదు మాధవరావు.

.........

ఒకరోజు రాత్రి ఏడు గంటలు కావస్తోంది పక్కింటి నారాయణ పరుగుతో వచ్చాడు "మాధవరావ్ గారు తొందరగా రండి మీ కొడుకు చింటూ పురుగుల మందు తాగేసి కాలేజ్ గ్రౌండ్‌లో పడిపోయాడు" అని చెప్పగానే షాక్‌తో మాధవరావు గుండె ఆగిపోయినంత పనైంది.

"తాగి చాలాసేపు అయింది అది బాడీ మొత్తం పాకిపోయింది పది నిమిషాలు లేటుగా వచ్చి వుంటే ట్రీట్‌మెంట్ కష్టం అయ్యేది" అన్నాడు డాక్టర్ రామయ్య.

చింటూ ఫ్రెండ్ నవీన్ జరిగినదంతా మాధవరావుకు చెప్పాడు.

"వాడు ఆన్ లైన్ బెట్టింగ్‌లు జోరుగా ఆడేవాడు. అస్తమానం అదే పని పైన వుండేవాడు. వాటి కోసం ఫైనాన్స్ యాప్‌ల ద్వారా వేలకు వేలు అప్పు తీసుకున్నాడు. ఇప్పుడు వాళ్ళ వత్తిడి ఎక్కువైందని చాలా సార్లు నాతో చెప్పి ఏడ్చాడు. ఆ వేధింపులు తట్టుకోలేక మీతో చెప్పుకోలేక ఇలా చేసాడు" అని అన్నాడు నవీన్. "ఎంత పని చేసావ్‌రా.. సెల్ ఫోన్ చూస్తుంటే ఏదో సరదాగా గేమ్స్ ఆడుకుంటున్నాడని అనుకున్నాం ఇలా ప్రాణం మీదికి తెచ్చుకుంటాడని అనుకోలేదు" అంటూ లీలావతి అంగలార్చింది. ఇంతలో డాక్టర్ అక్కడికి వచ్చి "బిల్ కట్టడానికి డబ్బు రెడీ చేసుకోండి" అన్నాడు రామయ్య.

దిగులుతో జేబులు తడుముకున్నాడు మాధవరావు. "ఏ.టి.ఎమ్.కార్డు తీసుకెళ్ళి తొందరగా డబ్బులు డ్రా చేసుకురాండి" అంది లీలావతి. ఉన్నట్టుండి మాధవరావు బోరున ఏడ్చేసాడు "కొంప మునిగిపోయిందే" అన్నాడు కన్నీళ్లు తుడుచుకుంటూ "ఏమైందండీ?" కంగారుగా అడిగింది లీలావతి "నా నెంబర్‌కు లాటరీ సిస్టమ్‌లో లోన్ తగిలిందని ఒకడు నన్ను నమ్మించి గొంతు కోసాడు. చదువురాని నా అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నన్ను నట్టేట ముంచేసాడు. కష్టం తీరిపోతుందని ఆశపడి కష్టపడి సంపాదించి పోగు చేసుకున్న డబ్బంతా పోగొట్టుకున్నాను. నా దగ్గర చిల్లిగవ్వ లేదు" అంటూ ఏడ్చాడు మాధవరావు.

లీలావతికి నోరు పెగల్లేదు "అంటే.. తండ్రి కొడుకులు ఇద్దరు మోసపోయారన్నమాట! వాడు చదువుకుని మోసపోయాడు నీవు చదువు లేక మోసపోయావు. ఆ సెల్ ఫోన్ ఇలా ఇవ్వండి" అంటూ సెల్ ఫోన్ దూరంగా విసిరినట్టు పక్కన పడేసింది "ఇలా చాలామంది మోసపోతున్నారు ఈ సంగతి పేపర్లలో, టీవీలలో జాగ్రత్తలు చెప్తున్నారు. అన్నీ తెలిసి ఎలా మోసపోయారండి? ఏ ప్రభుత్వ సంస్థ కూడా వ్యక్తిగత సమాచారం ఫోన్ ద్వారా స్వీకరించదు, ఏదైనా నేరుగా మనతో సంప్రదించి వివరిస్తారు. అంతేగానీ వాట్సాప్ లింక్‌లు మెసేజ్ లింక్‌లు పంపరు.. ఇకనైనా జాగ్రత్తగా వుండండి" డాక్టర్ రామయ్య అంటూ చింటూకు ట్రీట్మెంట్ స్టార్ట్ చేసాడు.

అప్పుగా డబ్బు తీసుకుని వచ్చి డాక్టర్‌కు చెల్లించి చింటూను ఆరోగ్యంగా ఇంటికి తీసుకువెళ్లారు, ఇక ఎప్పుడూ ఇలాంటి ఫోన్‌కాల్స్ నమ్ముకూడదనుకుంటూ.



# నిర్వచనం

జీవితం ఎలాంటిదో చెప్పమన్నావు
చెవొగ్గి విను
మంచు తుంపరులు తాకిన మల్లె
మొగ్గ
వర్షపు నీరు తగిలిన సారవంతమైన నేల
చిగురించిన చెట్టు కొమ్మమీద
పల్లవించే కుహూల కోకిల
జీవితం ఎలాంటిదో మరో విధంగా
చెప్పమన్నావు
మనసొగ్గి విను!
సాగర గర్భంలో శిథిలమౌతున్న
ఆణిముత్యం
చీకటి లోయలో చప్పుడు
లేని
సెలయేటి ప్రవాహం
శూన్య ప్రదేశంలో తిరుగుతున్న
నిరాశల స్వప్నం
నీ జీవితం ఎలాంటిదో చెప్పమన్నావు
స్పష్టంగా విను!
ఒకప్పుడు
నా జీవితం
జీవ నదీనదాల శోభితమై
ఆ తర్వాత
ఏ ఒయాసిస్సు లేని
ఒంటరి ఎడారై ఇప్పుడు..
చుట్టూ అలముకున్న కారు చీకటిలో
కాంతిని
కంటి నక్షత్రాల్తో
సృష్టించుకుంటున్న
స్వయం ప్రకాశపు తేజస్సు!
వేకువ వెలుతురుల ఉషస్సు!
అంతిమంగా జీవితానికి
ఒక నిర్వచనం చెప్పమన్నావు
సాలోచనగా విను!
నిండు నూరేళ్ల జీవితంలో
ఉన్నది
పోయినా
లేనిది లభించినా
స్థిత ప్రజ్ఞుడై బతకటం
స్థిరత్వ మానసిక స్థితిలో
జీవించడం

– రవి నన్నపనేని

## నానీలు

అమ్మ ఊపిరి
ఆగిందని రాయబోతే
కలం
కన్నీళ్లు కార్చింది.
...
ముందు వెలుగు
వెనుక నీడ
తెలుపు నలుపుల
సమ్మేళనమేగా జీవితం.
....
చూసిన నయనాలు
చెప్పిన వచనాలు
మనసు వినక
మొరాయించింది.
.......
దూరం భారం కాదు
పలకరింపులే ప్రతిక్షణం
చరవాణి ఉందిగా
చేతిలో.
.....
చదువయింది
పుస్తకాలు లేని
జీవిత పాఠాలు
పరీక్షలు మొదలు.

– శాంతమూర్తి

ఈ వారం కవిత్వం

## కలం

జగాన్ని జాగురపరిచే భానుడి ఉదయ కాంతి
రేఖలను
తిమిరాలను ఛేదించే కలువరేడు వెన్నెల వెలుగును
నింగి నుండి జాలువారె చినుకుల చిటపట రాగాలను
చిరుజల్లులో పులకరించే పుడమితల్లి అందాలను
అందంగా వర్ణించే అద్భుత శక్తి
"కలం" నుండి జాలువారె 'కవితా' వనికే దక్కును.

సృష్టిలోని అద్భుతాలు ప్రకృతి అందాలను
మగువలోని సొగసులు మగవారి డాంబికాలను
ప్రశాంతమైన పల్లెలను దానికే పరిమితమైన పచ్చని పైరులను
వృక్షజాతి వర్ణాలు మూగజీవుల స్వగతాలను
అందంగా వర్ణించే అద్భుత శక్తి
'కలం' నుండి జాలువారె 'కవితా'వనికే దక్కును.

గగనమున విహరించే విహంగ విన్యాసాలను
సాగర అల పొంగులను సెలయేటి సయ్యాటలను
భరతఖండ రక్షక కవచాలుగ వెలసిన హిమాలయ శిఖరాలను
వేదసార విజ్ఞానం భరతమాత భవ్య చరితను
అందంగా వర్ణించే అద్భుత శక్తి
"కలం" నుండి జాలువారె 'కవితా'వనికే దక్కును.

మహామహుల చరిత్రను దుష్టుల దుశ్చర్యలను
దేశసేవలో అమరులైన జవానుల వీరగాథలను
ధనవంతుల విలాసాలు
నిరుపేదల నిర్జీవ బతుకులను
అందంగా వర్ణించే అద్భుత శక్తి
"కలం" నుండి జాలువారె 'కవితా'వనికే దక్కును.

మనసులోని భావాలను పెదవి పలుకలేని వేళ
అక్షరాల కూర్పుతో అందమైన పదాలతో పరిమళాల
మాల చేసి హృదయాన్ని గెలుపొందే అద్భుత శక్తి
"కలం" నుండి జాలువారె 'కవితా' వనికే దక్కును.
అంతులేని భావాలకు అందమైన రూపకర్త
విజ్ఞాన విధాత అక్షర ఆయుధం 'కలం'.

– భారతీకృష్ణ



పెసలూ, శనగల్లాంటివి నానబెట్టి మొలకలొచ్చాక తింటుంటాం కదా! ఈ పోషకాల గనులు మంచివని ఎంత చెప్పినా పిల్లలకు పెద్దగా నచ్చవు. మరి వాళ్లు పేచీ పెట్టకూడదంటే.. వాటితో కూరలు చేస్తే సరి..


# పప్పులతో వెరైటీ రుచులు

## శనగలతో..



**కావలసినవి:** కొబ్బరిపాలు-అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు-ముప్పావు కప్పు, శనగలు-రెండు కప్పులు, కొబ్బరి తురుము-కప్పు, నూనె-5 చెంచాలు, సన్నగా తరిగిన అల్లం-టేబుల్ స్పూన్, వెల్లుల్లి తరుగు-చెంచా, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-అర చెంచా, కారం, గరం మసాలా, కర్రీ పౌడర్, జీలకర్ర పొడి-చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, నిమ్మరసం-అర చెంచా, ఉల్లి, టొమాటో, నిమ్మచెక్కలు-అలంకరించేందుకు. **తయారీ:** కడాయిలో నూనె వేసి వేడయ్యాక.. ఉల్లి, అల్లం, వెల్లుల్లి తరుగులను వేయించాలి. ఇవి లేత గోధుమ రంగులోకి మారాక.. ఉడికిన శనగలు, కారం, గరం మసాలా, కర్రీ పౌడర్, జీలకర్ర పొడి, ఉప్పు, పసుపు.. ఇలా అన్నీ జతచేసి సన్న సెగ మీద మగ్గనివ్వాలి. ఇందుకు ఐదు నుంచి ఆరు నిమిషాలు పడుతుంది. తర్వాత కొబ్బరి తురుము, కొబ్బరి పాలు జోడించి, మరోసారి కలియ తిప్పాలి. దగ్గరగా అయ్యాక.. కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి దించేయాలి. ఇక ఉల్లి, టొమాటో, నిమ్మచెక్కలతో అలంకరిస్తే సరి.. ఎప్పుడెప్పుడూ తిందామా అనిపించేట్లు ఊరిస్తుంది శనగల కూర.


## పెసర్లతో...



**కావలసినవి:** నూనె-3 చెంచాలు, పెసలు-ముప్పావు కప్పు, ఉల్లి, టొమాటో తరుగు-పావు కప్పు, చొప్పున, పచ్చి మిర్చి ముక్కలు- చెంచా, ఉప్పు-రుచికి తగినంత, అల్లం-వెల్లుల్లి ముద్ద- టేబుల్ స్పూన్, పసుపు, ఆమ్‌చూర్ పౌడర్, గరం మసాలా, బెల్లంపొడి-అర చెంచా చొప్పున, కశ్మీరీ కారం, ధనియాల పొడి, ఆవాలు, జీలకర్ర-చెంచా చొప్పున, ఇంగువ-చిటికెడు, కొత్తిమీర తరుగు-పావు కప్పు. **తయారీ:** కుక్కర్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు, జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు ఇంగువ, ఉల్లి తరుగు, అల్లం వెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలియతిప్పాలి. అవి దోరగా వేగి, మంచి వాసన వస్తుండగా టొమాటో తరుగు, పసుపు, ధనియాల పొడి, కశ్మీరీ కారం, ఆమ్‌చూర్ పౌడర్, గరం మసాలా, బెల్లం పొడి, ఉప్పు, ఉడికించిన పెసలు, మూడు కప్పుల నీళ్లు జోడించి ఒక విజిల్ వచ్చేదాకా ఉడికించాలి. ఆవిరి పోయాక.. మూత తీసి, కొత్తిమీర తరుగు చల్లాలి.

## రాజ్మాతో...

**కావలసినవి:** రాజ్మా (రెడ్ బీన్స్) గింజలు-కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు-ముప్పావు కప్పు, టొమాటో గుజ్జు-కప్పు, అల్లం వెల్లుల్లి పచ్చిమిర్చి ముద్ద-టేబుల్ స్పూన్, ఉప్పు-రుచికి సరిపడా, పసుపు-అర చెంచా, కశ్మీరీ కారం-రెండు చెంచాలు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, ఆమ్‌చూర్ పౌడర్, పంచదార-చెంచా చొప్పున, మెంతి ఆకులు పొడి-రెండు చెంచాలు, వెన్న-3 చెంచాలు, కొత్తిమీర తరుగు-చారెడు, కీరదోస, టొమాటో స్లైసులు-అలంకరించేందుకు. **తయారీ:** కడాయిలో వెన్న కరిగాక.. జీలకర్ర వేసి అదీ వేగాక.. అల్లం వెల్లుల్లి, పచ్చిమిర్చి ముద్ద, ఉల్లి తరుగులను వేయించాలి. అవి బంగారు రంగులోకి మిరాకా.. పసుపు, ఉప్పు, ధనియాల పొడి, కాస్త కశ్మీరీ కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, టొమాటో గుజ్జు వేసి కలియతిప్పాలి. టొమాటో పచ్చి వాసన పోయేదాకా వేయించాలి. అందులో ఉడకబెట్టిన రాజ్మా, ఆమ్‌చూర్ పౌడర్, అర కప్పు నీళ్లు జోడించి, సన్న సెగ మీద ఏడెనిమిది నిమిషాలు ఉడికించాలి. చివర్లో పంచదార, మెంతి ఆకుల పొడి, కొత్తిమీర తరుగు వేసి దించండి. రాజ్మా కూర రెడీ.



## సోయా బీన్‌తో..

**కావలసినవి:** సోయా బీన్-కప్పు, ఉల్లి పాయలు-2, కొబ్బరి తురుము-ముప్పావు కప్పు, నూనె-4 చెంచాలు, పసుపు-అర చెంచా, ఉప్పు-రుచికి సరిపడా, మిరియాలు, జీలకర్ర, ధనియాలు-2 చెంచాల చొప్పున, ఎండుమిర్చి-4, వెల్లుల్లి-అరపాయ, ఆవాలు-చెంచా, కరివేపాకు-3 రెబ్బలు. **తయారీ:** ఉల్లిపాయలు సన్నగా తరగాలి. మిరియాలు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లి, ఎండుమిర్చిలను మెత్తగా గ్రైండ్ చేసి పక్కనుంచాలి. కడాయిలో 3 స్పూన్ల నూనె కాగనిచ్చి.. ఆవాలు వేయాలి. అవి చిటపటలాడుతుండగా కరివేపాకు, ఉల్లి తరుగు వేయాలి. అది దోరగా వేగాక.. ఉడికించిన సోయా బీన్ గింజలు, పసుపు, నూరిన మసాలా పేస్టు, పావు కప్పు నీళ్లు జతచేసి ఉడికించాలి. ఏడెనిమిది నిమిషాల తర్వాత.. మిగిలిన చెంచా నూనె చల్లి.. కలియతిప్పి దించేయాలి. అంతే.. నోరూరించే 'సోయా బీన్ ఇగురు' తయారై పోతుంది. అన్నంలో కంటే ఇది చపాతీలు, పూరీల్లోకి చాలా బాగుంటుంది.







బి.మధుపాలి

# నీరే ప్రాణాధారం

గత సంవత్సరం ఆద్యంతం వరుణుడు మొరాయించి, పెద్దగా కరుణించక అంతంత మాత్రమే వర్షాలు కురిపించడంతో అటు రాష్ట్ర వ్యాప్తంగా రైతు సోదరులు నష్ట పోవడంతో పాటు, రాష్ట్ర ప్రజలు కూడా చాలా తీవ్రంగా తాగునీటికి అష్టకష్టాలు చవిచూశారు. ఇది ఇలా వుంటే రానున్నది ముసళ్ల పండుగ అన్నట్లు.. అతి త్వరలో రానున్న మండు వేసవి కాలంలో తాగునీటికి ప్రజలు ఇంకెంత ఇబ్బందుల పాలు కావాలో! ముఖ్యంగా గ్రామాలలోని ప్రజలు నీటి కోసం ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించాలో, ఎంతెంత దూరం పోవాలో.. తెలియని అగమ్యగోచర పరిస్థితి వారిది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న వేసవి ప్రజలకు నీటి కటకట తప్పవు. ఒక విధంగా చెప్పాలంటే తాగునీటి అవసరాలకు ప్రజలు తీవ్ర కసరత్తు సైతం చేయాల్సిన తప్పని పరిస్థితి వారిది కాబట్టి ఈ తాగునీటి కష్టాల నుంచి సామాన్య ప్రజలను కొంతలో కొంత బయట పడేయాలంటే మాత్రం గ్రామ, నగర పంచాయితీవారు యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజల నీటి కష్టాలను తీర్చడానికి నడుం బిగించాల్సిందే. ఇందులో భాగంగా– వాడ, వాడలకు, వీధి వీధికి నీళ్ల ట్యాంకులను ఒక క్రమ పద్ధతిలో ప్రజలకు సప్లయ్ చేసి వారి నీటి దాహార్తిని తీర్చాల్సిన గురుతర బాధ్యత వారిపై ఎంతైనా వుంది. అదేమాదిరి సామాజిక సేవా సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలు, బిజినెస్ టైకూన్స్, అయా రంగాల సెలబ్రిటీస్, రాజకీయంగా ఉన్నత స్థానాల్లో వున్నవారు, ఉన్నత ప్రభుత్వ ఉద్యోగులు, సేవాభావం మెండుగా గల ధనికులు ఇలా ప్రతి ఒక్కరూ కూడా తమ వంతుగా ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు ఒక గొప్ప మహోన్నత దృక్పథంతో ముందుకు రావాల్సిన గొప్ప శుభ తరుణం ఇదే. ఎందుకంటే తాగునీరు అనేది ప్రతి ఒక్కరికి అత్యంత అవశ్యకమైన వనరు. అది లేకపోతే మానవ మనుగడకు సైతం తీవ్ర అంతరాయం కచ్చితంగా ఏర్పడి తీరుతుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని అంతో ఇంతో ఆర్థికంగా బాగా వున్నవారు ప్రతి ఒక్కరు కూడా తమ వంతుగా, తమ కర్తవ్యంగా ఈ నీటి ఎద్దడి నివారణకు తమ సర్వశక్తులు ఒడ్డి "మానవసేవే మాధవసేవ.. ప్రార్థించే చేతులకన్నా సహాయం చేసే చేతులు మిన్న" అనే నీతి సూత్రాలకు పట్టం కట్టి, తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరమే, తక్షణమే చాలా వేగవంతంగా చర్యలు చేపట్టి ప్రజల కనీస అవసరం అయిన నీటి తిప్పలను కొంతలో కొంత తీర్చగలిగితే మీరు ప్రజలకు ఎంతో గొప్ప మహత్ కార్యం చేసిన వారవుతారు.



మీరు చేయాల్సిన తక్షణ కార్యం నీరు పడే అవకాశం వున్న బోర్ పాయింట్లను మంచి నైపుణ్యం గల వారి ద్వారా చూపించి బోర్లు వేసే బృహత్తర కార్యక్రమానికి స్వీకారం చుడితే, అందుకు గ్రామ, నగర పంచాయితీ వారి మద్దతు, తోడ్పాటు, సహకారం సైతం తోడైతే అది ప్రజలకు తాగునీటి బెడదను, తాగునీటి విషయంలో వారికున్న ఆందోళనను మీరు కొంతలో కొంత అయినా రూపుమాపిన వారవుతారు. ఎందుకంటే గతంలో ఇలా సకాలంలో వర్షాలు పడక తాగునీటి కరువు వచ్చిన దయనీయ పరిస్థితులు సామాన్య ప్రజలను ఎంతగా ఇక్కట్లపాలు చేశాయో, కేవలం ఒక బిందె నీటి కోసం ఎన్నో కిలోమీటర్ల వరకు వారంతా ప్రయాణం చేశారో మనకు తెలియంది కాదు.

ఒక విధంగా అలాంటి తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఇప్పుడు మళ్లీ మన కళ్లముందు సాక్షాత్కరించ బోతున్నాయి.. అనే మాట సత్య దూరం కాదు.

ఏది ఏమైనా ప్రతి ఒక్కరు కేవలం నోటి మాట ద్వారా కాకుండా తమ చేతల ద్వారా రాష్ట్ర ప్రజలకు వచ్చిన ఈ తాగు నీటి గండం, యమపాశం నుంచి బయటపడే మార్గాలను అన్వేషణ గావించి వీలయినంత త్వరగా తాగునీటి నివారణకు, కష్టాలకు చరమగీతం పాడి తమ చేయూతను అందించి ప్రజలను యుద్ధ ప్రాతిపదికన, అగమేఘాలతో ఆదుకోవాల్సిన తక్షణ కర్తవ్యం, కనీస బాధ్యత వారి భుజస్కందాలపై వుంది. ఏమైన జల వనరులు లోపిస్తే, వర్షాధార పరిస్థితులు తీవ్ర రూపం దాల్చి జలం అడుగంటితే చుక్క నీరు కూడా అందలేని అత్యంత దారుణమైన పరిస్థితులు అయా గ్రామాలకు, నగరాలకు తలెత్తితే అక్కడి ప్రజల జీవితాలు కడు దుర్భరంగా మారడం, అతలాకుతలం కావడం, తాగునీటిని సైతం డబ్బులు పెట్టి, కొలుగోలు చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు రావొచ్చు. అందువల్ల రాబోయే నాలుగు నెలలు రాష్ట్ర ప్రజలందరికి కూడా తాగునీరు సకాలంలో అంది తాగునీటి కష్టాలను అధిగమించాలని ఆశిద్దాం.. ఆకాంక్షిద్దాం!

– అనవసరంగా ఆలోచిస్తే ఆరోగ్యం పాడవుతుంది. ఆలోచన ఆచరణకు పురిగొల్పేదిగా ఉండాలి.

– సుఖానికి దగ్గరవ్వాలంటే కష్టాన్ని అనుభవించాలి. ఈ రోజు నీది అనుకున్నది రేపు ఇంకొకరి సొంతం కావచ్చు.

# ఆలోచింపచేసే రచన

**ఒక** ఉద్యమకారుని వామపక్ష విప్లవోత్తేజ ప్రస్థానంలో అనుభవాలు, సాధక బాధలు, రాజకీయ నిర్ధారణలతో వర్తమాన సమాజాన్ని తట్టిలేపి ఆలోచింపచేసే చారిత్రక కథనం 'నక్సలిజం నాకేం నేర్పింది?'. నక్సలిజం పట్ల ఆకర్షితులై ఎందరో యువకులు అడవిబాట పట్టి, తుపాకి చేపట్టి సాయుధ పోరాటం పేరిట ప్రాణాలు కోల్పోతుండటం, ప్రాణాలు తీస్తుండటం చారిత్రక సత్యం. నక్సలైట్ ఉద్యమం నుంచి, సీపీఎమ్‌లోకి మళ్లీ చేరిన రాములు, అంబేద్కర్ పట్ల నక్సలైట్ నాయకత్వం వ్యతిరేకత కలిగి వుండటం పెద్ద తప్పు అని స్పష్టీకరించారు. విప్లవోద్యమానికి ఆటంకంగా మారిన కుల వ్యవస్థపై పోరాటం నిర్వర్తిస్తూ మిగతా వర్గ పోరాటాలతో సమన్వయం చేసుకోవాలనే స్పృహ లేకపోవడం తప్పు అని స్పష్టం చేసారు. ఆర్థిక దోపిడీతో పాటు సామాజిక దోపిడీ కారణంగా రచయిత ఎదుర్కొన్న వివక్ష, అసమానత, అవమానాల నేపథ్యం, ఉద్యమ సిద్ధాంతవేత్తగా, సిపిఎం ఉద్యమనేతగా తన హృదయాంతరంగాన్ని రాములు అక్షర రూపంలో నిజాయితీ, చిత్తశుద్ధితో వ్యక్తీకరించడం అభినందనీయం. ఐదారు దశాబ్దాలుగా కమ్యూనిస్ట్ ఉద్యమ కార్యాచరణతో సన్నిహిత అనుబంధం వున్న జి.రాములు, గ్రంథస్తం చేసిన ఆలోచనలు, అనుభవాలు ఆసక్తికరంగా చదివింపచేస్తున్నాయి.



– జయసూర్య

**(నక్సలిజం నాకేం నేర్పింది?; రచయిత-జి.రాములు; తెలంగాణ పబ్లికేషన్స్, 1వ అంతస్తు, 1-1-80/15, ఆర్.టి.సి. ఎక్స్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్; వెల: రూ.200/-)**

# ఓ మంచి పుస్తకం

పుస్తక సమీక్ష

**బాల** బాలికల కోసం శాంతాభాస్కర్ ఇరవై సంవత్సరాల నుండి ఎన్నో విలువైన పుస్తకాలు వెలువరిస్తూ పిల్లలకు విజ్ఞానంతో బాటు విద్యా, వికాసం కలిగిస్తున్నారు. విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తలు, మార్గదర్శకులు, సైన్స్ వ్యాసాలు, జంతు ప్రపంచం, పిల్లల పద చదరంగం, బాలల గేయాలు, విశిష్ట మహిళా శాస్త్రవేత్తలు లాంటి 44 పైగా పుస్తకాలు ఇప్పటికే ప్రచురించి బాల సాహిత్యాన్ని శాంతాభాస్కర్ సుసంపన్నం చేస్తున్నారు. ఈ పుస్తకంలో 21 అంశాలు తీసుకొని ఎన్నో విజ్ఞానదాయక అంశాలు పిల్లలకు, పెద్దలకు అర్థమయ్యేలా చక్కగా వివరించారు. మరణంలోనూ మహా దానం, అవయవ దానం, వండిన ఆహార పదార్థాల వృథా ఆపుదాం, స్థూలకాయాన్ని సులువుగా వదిలించుకుందాం, ఫ్లోరోసిస్, బాల్య వివాహం, బయోగ్యాస్, పొగ లేని పొయ్యి, కాలేయం, తాటిచెట్టు.. లాంటి వ్యాసాలు ఎంతో ప్రయోజనకరమైనవి. భారతదేశంలో అవయవ దానం చేసేవాళ్లు లేక యేటా 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, ప్లీహం, క్లోమం, జీర్ణాశయం వంటి అవయవాలు బ్రెయిన్ డెడ్ వ్యక్తుల నుండి సేకరించి కావలసిన వారికి అందించి ప్రాణాలు కాపాడుతారు. స్థూలకాయంలో అమెరికా, చైనా, భారత్‌లు వరుస స్థాయిలో వున్నాయి. వాటి నివారణకు చక్కటి సలహాలు అందించారు. బయోగ్యాస్ గురించి రాసిన వ్యాసాలు గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనకరంగా వున్నాయి.

**(బాలలకోసంసైన్స్ వ్యాసాలు; రచయిత: టి.శాంతాభాస్కర్; పేజీలు: 96, వెల: రూ.100/లు; ప్రతులకు: లోకేష్ ప్రచురణలు, 2-711/2, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు-517 001)**

– తంగిరాల చక్రవర్తి



# అందాయి

**గణతంత్ర మొగ్గలు**
డా॥ భీంపల్లి శ్రీకాంత్
ప్రతులకు: డా॥ భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ
మహబూబ్‌నగర్-509 001.

**బాబూజీ**
(శ్రీ రామచంద్ర మిషన్, షాజహాన్‌పూర్ స్థాపకుల వారి జీవన కథనం)
కన్నడం: కె.శ్రీనివాస శాస్త్రి
అనుసృజన: వేలూరి కృష్ణమూర్తి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్,
కాచీగూడ, హైదరాబాద్.

**మంచి సినిమాలు**
రచయిత: గన్నవరపు నరసింహమూర్తి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

**నల్ల పద్యం(కవిత్వం)**
రచయిత: పిన్నంశెట్టి కిషన్
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**వానపాట(కవిత్వం)**
వానపాట(కవిత్వం)
రచయిత: దర్భముళ్ళ చంద్రశేఖర్
ప్రతులకు: దర్భముళ్ళ చంద్రశేఖర్
303, ఆర్.ఆర్.టవర్సు,
రైతుబజారు ఎదురుగా, గోపాలపట్నం
విశాఖపట్నం-530 027

**చెమటపోగుల కళనేత (చేనేత వ్యాసాలు)**
రచయిత: కోడం పవన్‌కుమార్
ప్రతులకు: లయ పబ్లికేషన్స్
3-12-110/బి, గణేష్ నగర్
రామంతాపూర్, హైదరాబాద్-13

**అన్నమయ్య వెంగమాంబల కవితా వీక్షణం**
రచన: ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**ఆర్తి**
రచయిత: కుపిరెడ్డి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

**విస్తార**
కవిత్వ సాహిత్య వ్యాసాలు
ఎమ్వీ రామిరెడ్డి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**ప్రస్తార**
కథా సాహిత్య వ్యాసాలు
ఎమ్వీ రామిరెడ్డి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్


**కీలుగుర్రం**
బాలగేయాలు
డా॥ ఎన్.గోపి
ప్రతులకు: పత్తిపాక ఫౌండేషన్
5-4-47, పత్తిపాక వీధి
సిరిసిల్ల-505 301.

కథ

# ఈత ఆవశ్యకత

సిద్ధవరం అనే గ్రామానికి చెందిన చెరువు ఈత కొడుతున్న పిల్లల కేరింతలతో కోలాహలంగా ఉంది. ఈత భలే సరదానిస్తుంది. అందుకే ఎంతసేపటికి పిల్లలు నీటి నుంచి బయటికి రారు. చెరువులో ఇండియా, పాకిస్తాన్ యుద్ధం జరుగుతోంది. యుద్ధం తుపాకులతో కాదు. అది ఒక సరదా ఆట. ఇండియా అని పేరు పెట్టుకున్న తీరం వైపు కొందరు, పాకిస్తాన్ అని పేరు పెట్టుకున్న తీరం వైపు మరికొందరు ఈ ఆటలో పాల్గొంటారు. మొదట ఇరు వర్గాలవారు చెరువులో మధ్యలోకి ఎదురు ఎదురుగా వస్తారు. ఇరు వర్గాలవారు ఒకరిపై ఒకరు చేతులతో నీళ్ల జల్లుకుంటూ పోరాటం చేస్తారు. ఏ వర్గంవారి బలం ఎక్కువ ఉంటే ఆ వర్గం వారు ముందుకు దూసుకుపోతారు. ఏ వర్గం వారు అయితే ఎదుటి వర్గంవారిని వారి తీరం వైపు పారిపోయేలా తరిమి కొడితే వాళ్ల గెలిచినట్లు లెక్క. ఇలా చెరువులో వివిధ రకాల ఆటలు ఆడుతూ ఉంటారు,

మరో తీరం వైపు గురుమూర్తి అనే ఒక గురువు ఈత రాని పిల్లలకి శిక్షణ ఇస్తూ ఉంటాడు. ఒక్కడు మాత్రం చెరువుగట్టును కూర్చొని అక్కడ జరిగే సరదా



ఆటల్ని తిలకిస్తూ నవ్వుతూ ఉంటాడు. అంతేకాదు, విడిచి వెళ్లిన పిల్లల బట్టలకి కాపలా ఉంటాడు. వాడి పేరు మధుకర్. వాడికి ఈత అంటే భయం. అంతేకాదు దెబ్బలు తగులుతాయని ఆటల్లో కూడా పాల్గొనడు. గురుమూర్తి మధుకర్‌కి ఈత నేర్పాలని చాలా సార్లు ప్రయత్నించాడు. వాడిని ఈతకు రమ్మని పిలిచినప్పుడల్లా పారిపోయేవాడు.

ఒకరోజు మధుకర్ గట్టున కూర్చుని చెరువులో ఆటల్ని తిలకిస్తూ ఉండగా, ఊహించిన ప్రమాదం జరిగింది. రెండు కోడెదూడలు చెరువు గట్టు మీద వున్న పచ్చిక మేస్తూ ఒకదానికొకటి ఎదురు పడ్డాయి. వెంటనే ఒకదానిపై ఒకటి తలపడుతూ పోరాడసాగాయి. క్రమంగా ఆ పోరాటం తీవ్రమై మధుకర్ మీదికి దూసుకు వచ్చేసాయి. మరుక్షణం మధుకర్ ఊహించని విధంగా చెరువు నీటిలో పడిపోయాడు. ఈత రాక మధుకర్ చెరువులో మునకలు వేస్తూ ఊపిరాడని స్థితిలో ఉన్నాడు.

అప్పుడు తెలిసింది మధుకర్‌కి.. గురువుగారు ఈత నేర్పుతానని పిలిచినప్పుడు పారిపోవడం ఎంత తప్పో! ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడిం ది. ఇప్పుడు చింతించి ఏమీ లాభం?

మధుకర్ ప్రమాదంలో ఉండటం ఈతలో శిక్షణ ఇచ్చే గురువు గురుమూర్తి గుర్తించాడు. వెంటనే అతడు మధుకర్‌ను రక్షించి గట్టుకు చేర్చాడు. నీళ్ల కక్కించడం లాంటి ఉపచారాలు చేయడంతో మధుకర్ కోలుకున్నాడు. "ఈరోజు మీరు నా ప్రాణాలు కాపాడారు మీ మేలు ఎన్నటికీ మరువలేను" అంటూ గురుమూర్తికి మధుకర్ అనేక నమస్కారాలు పెట్టుకున్నాడు.

"ఈరోజు జరగవలసిన నా కుమార్తె పెళ్లి చూపులు రేపటికి వాయిదా పడ్డాయి. ఒకవేళ ఆ పెళ్లి చూపులు ఈరోజు జరిగి ఉంటే నేను చెరువు వద్దకు వచ్చి ఉండేవాడిని కాదు. అప్పుడు నిన్ను ఎవరూ రక్షించేవారు కాదు. ప్రతి మనిషికి చదువు ఆటలతో పాటు ఈత కూడా ముఖ్య అవసరం. పడవ మునిగినప్పుడు, వరదలు వచ్చినప్పుడు మనల్ని మనం స్వయంగా రక్షించుకోవచ్చు. అంతేకాదు.. ఇతరులను కూడా రక్షించవచ్చు. ఈత వలన, ఆటల్లో పాల్గొనడం వలన శరీరానికి వ్యాయామం అవుతుంది. వ్యాయామం వల్ల శరీరం దృఢంగా మారుతుంది. శరీర దారుఢ్యం వల్ల మనకు ఆరోగ్యం చేకూరుతుంది" అంటూ హితవు చెప్పాడు. గురుమూర్తి మాటలతో మధుకర్‌కు జ్ఞానోదయం అయింది. తరువాత శ్రద్ధగా ఈత నేర్చుకున్నాడు. దెబ్బలు తగులుతాయి అన్న భయం వదిలేసి ఆటల్లో కూడా పాల్గొనడం మొదలుపెట్టాడు.

– గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు

## బాలగేయం

# జీవన సరళి



పిల్లల్లారా...
పిడుగుల్లారా...
వేళకు నిద్ర లేవాలి
చక్కగ పళ్ల తోమాలి
చిక్కని పాలు తాగాలి
ఒంటికి యోగా కావాలి
బాగా చెమటలు పట్టాలి
స్నానం చేయాలి
సబ్బుతో మురికి పోవాలి
టవలుతో ఒళ్లూ
తుడవాలి
ఉతికిన బట్టలు వేయాలి
బూట్లూ టై కట్టాలి
బ్రెడ్డూ, జామూ తినాలి
మంచిగ బడికి పోవాలి
శ్రద్ధగ పాఠాలు నేర్వాలి
క్లాసులో ఫస్టుగ నిలవాలి
బళ్లో అన్నమే తినాలి
నీళ్లెక్కువగా తాగాలి
ఆటలు కూడా ఆడాలి
హాయిగ ఇంటికి చేరాలి
పెద్దలు చెప్పింది వినాలి
ఇంట్లో వండినవే తినాలి
స్మార్టు ఫోనునీ వదలాలి
స్మార్టుగ నువ్వు ఎదగాలి!

– శర్మ సిహెచ్

# హాలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**ఎస్. కళ్యాణి, నాగర్‌కర్నూలు**

**ప్రశ్న:** లాయర్ కోటు, గొడుగులను నల్లటి వస్త్రంతోనే తయారు చేస్తారు.. ఎందుకు?

**జవాబు:** లేత రంగుల కన్నా నలుపు రంగు లేదా ఇతర ముదురు రంగులు పరిసరాల నుంచి ఎక్కువ ఉష్ణోగ్రతను గ్రహిస్తాయి. దాంతో బాష్పీభవన ప్రక్రియ వేగంగా జరిగి, త్వరగా ఆరిపోతాయి. నల్లటి బట్టల అణు నిర్మాణంలో అన్ని రంగుల కాంతులను గ్రహించి ఉత్తేజితం అయ్యే స్వభావం ఉంటుంది. నల్లటి వస్త్రాల మీద పడిన కాంతి మొత్తం శోషణం చెందుతుంది. తీవ్ర స్థాయిలో వున్న ఉష్ణాన్ని ఈ నలుపు రంగు మింగేస్తుందని చెప్పుకోవచ్చు. మరో రకంగా పడిన ఎండవేడిమిని చెల్లాచెదురు చేస్తుందని చెప్పవచ్చు. అంతేకాదు, నలుపు రంగు వస్త్రంతో గొడుగులు తయారు చేయడం వల్ల, అవి త్వరగా పొడిగా అవుతాయి. ఇటీవల గొడుగులకు సింథటిక్ వస్త్రాలను వాడుతున్నారు. ఇవి నీటిని పీల్చుకోవు. త్వరగా ఆరతాయి. ఇంకా చెప్పాలంటే అన్ని కాంతి తరంగాలను(రంగులను) గ్రహించగలిగేది నలుపు రంగు మాత్రమే.

**సి.ప్రభావతి, వేములవాడ**

**ప్రశ్న:** రష్‌మోర్ పర్వత శిఖరం దేనికి ప్రసిద్ధి?



**జవాబు:** అమెరికాలోని సౌత్ డకోటాకు చెందిన బ్లాక్‌హిల్స్‌లో ఉంది రష్‌మోర్ పర్వతం. అద్భుతమైన శిల్పకళకు పెట్టింది పేరు ఈ పర్వతం. అమెరికా అధ్యక్షులైన జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, అబ్రహం లింకన్, థియోడోర్ రూజ్‌వెల్ట్ మొహాలను పోలి వుండేటట్టుగా ఇక్కడ పర్వత శిఖరాలను చెక్కారు.

# క్షయ నివారణ సాధ్యమేనా?

డా॥ కె.ఉమాదేవి

**ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల్ని మించి ప్రపంచ జనాభాని ఆందోళన పరుస్తున్న దీర్ఘకాలిక, ప్రగతిశీల, మైకో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ క్షయ వ్యాధి. పురాతన కాలం నుంచి పీడించే వ్యాధుల్లో ఇది మొదటిది. దీనికి 150 మిలియన్‌ల చరిత్ర ఉంది. క్షయ అనే పదం లాటిన్ పదం ట్యూబర్క్యులా నుండి వచ్చింది. దీని అర్థం చిన్న ముద్ద. 1834లో జోహన్‌స్కోన్ లీన్‌కు క్షయ వ్యాధి అని పేరు పెట్టారు.**

క్షయ వ్యాధి మైకోబాక్టీరియమ్



ట్యూబర్క్యులస్ అనే బాక్టీరియా వల్ల వస్తుంది. ఈ సూక్ష్మజీవి 4 మీ పొడవు, 1 మీ. వ్యాసం కలిగిన ఒక చిన్న పుల్ల ఆకారంలో ఉండే కంటికి కనిపించని బాక్టీరియా. ఇది జీవించడానికి ఆక్సిజన్ అవసరమవుతుంది. మానవులు దీనికి రిజర్వాయర్స్‌గా పని చేస్తారు. ఇది మెల్లగా, నిదానంగా పెరిగే వెరోబిక్ బాసిల్లై. ఇది సంక్లిష్టమైన లిపిడ్ రిచెసెల్ ఎన్వలప్‌తో విభిన్నంగా ఉంటుంది. ఇవి వాటిని ఆసిడ్‌ఫాస్ట్‌గా పని చేస్తాయి. కాబట్టి దీన్ని వెరోబిక్ బాక్టీరియా అని పిలుస్తారు.

## వ్యాప్తి

రోగి దగ్గినా, నవ్వినా, తుమ్మినా, మాట్లాడినా, సన్నిహితంగా 8-10 గంటలు మసలినా కొన్ని లక్షల నక్రిములు గాలిలోకి విసర్జించినపుడు ఆ గాలిని పీల్చిన వాళ్లకి క్షయ వ్యాధి వస్తుంది. రోగి దగ్గినప్పుడు వచ్చే కఫంలో కూడా క్రిములుంటాయి. నేల మీద ఎక్కడ పడితే అక్కడ ఉమ్మివేసినపుడు క్రిములు ఎండిపోయి గాలికి ఎగిరే ధూళి ద్వారా కూడా మనం పీల్చే గాలిలో ప్రవేశించి ఊపిరితిత్తుల్లోకి చేరవచ్చు. ఇవి ప్రతి 24-48 గంటలకి పునరుత్పత్తి చెందే సామర్థ్యం కలిగిన వుంటాయి. సూర్యరశ్మికి గురైనపుడు వేగంగా నశిస్తాయి. మామూలుగా అయితే 10 వారాల వరకు సజీవంగా అంటువ్యాధిగా ఉంటాయి. తరుచుగా నిద్రాణ స్థితిలో ఉంటాయి. ఇవి చాలా నక్రిమి సంహారకాల్ని తట్టుకోగల చిన్న బాసిల్లస్ కనుక దీనికి మల్టీ డ్రగ్స్ థెరపీ అవసరమవుతుంది.

ఇవి వాతావరణ పరిస్థితుల్ని బట్టి చాలా గంటలు గాలిలో ఉంటాయి. ఇవి బయటి ప్రాంతాల కన్నా ఇండోర్ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. క్షయ క్రిములు దాదాపు 3 మిలియన్ సంవత్సరాల వరకు వుండవచ్చు అని పరిశోధకుల అంచనా. అందువల్లనే దీన్ని అరికట్టడానికి డబ్ల్యుహెచ్ఓ అనేక మార్గనిర్దేశకాల్ని అమలు పరుస్తుంది. అంతేగాకుండా శోషరస గ్రంథుల ద్వారా(లింఫాటక్స్), రక్తం ద్వారా కూడా శరీరంలోని క్షయ వ్యాధి వ్యాపించే అవకాశముంది. డబ్ల్యుహెచ్ఓ అంచనా ప్రకారం ప్రతి యేటా ఎనభై లక్షల కొత్త క్షయ వ్యాధి కేసులు కనుగొంటే అందులో ముప్పై లక్షల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారు. క్షయ వ్యాధికి చిన్న వయస్సులోనే బిసిజి వాక్సిన్ వేసుకున్నా, క్షయ వ్యాధికి పూర్తిగా మందుల చికిత్సతోనే విజయవంతంగా నయం చేయగలిగిన వ్యాధి.

ప్రపంచ వ్యాప్తంగా 10 మిలియన్స్ టిబితో బాధపడితే అందులో 1.5 మిలియన్స్ చనిపోతున్నారు. ఇది ప్రపంచ వ్యాప్త మహమ్మారి అని చెప్పవచ్చు. 2050 నాటికి క్షయని ప్రజారోగ్య సమస్యగా తొలగించడానికి 'స్టాప్ టిబి' అనే వ్యూహంతో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్(ఎన్‌టిఇపి), జాతీయ క్షయ నిర్మూలయ కార్యక్రమాల్ని అమలులోకి తెచ్చింది.

## కారణాలు

పోషకాహార లోపం, రక్తహీనత ద్వారా శరీరం బలహీనమైనపుడు, దీర్ఘవ్యాధులు, డయాబెటిస్, ఎయిడ్స్, గుండె, కిడ్నీ వ్యాధులు, సిలికోసిస్, సోరియాసిస్, కరోనా వ్యాధులతో బాధపడేవారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా వున్నవారిలో ఇమ్యూనిటీని దెబ్బతీసే స్టెరాయిడ్స్, కేన్సర్, పెట్రోవైరల్ మందుల వల్ల అవయవ మార్పిడి చేయించుకున్న వారిలో ఎక్కువగా వస్తుంది.

## రిస్క్ ఫ్యాక్టర్స్

రద్దీ ప్రాంతాలు, గాలి, వెలుతురు లేని చీకటి గదుల్లో వుండేవారు, నిరాశ్రయులు, పొగాకు, ఆల్కహాల్, నడ్రగ్స్‌ని వాడేవారిలో పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, తరచూ విదేశీ ప్రయాణాలు చేసేవారిలో, వలసలు వెళ్లేవారిలో క్షయ వ్యాధి ఎక్కువగా కన్పిస్తుంది.



## ప్రైమరీ ఇన్ఫెక్షన్

చాలా మందికి చిన్న వయస్సులోనే క్షయ ఊపిరితిత్తుల్లో ఏర్పడి త్వరగా నయమవుతుంది.

## సెకండరీ ఇన్ఫెక్షన్

ఇది వారి వారి వ్యాధి నిరోధక శక్తిని అనుసరించి ఊపిరితిత్తులు, లింఫ్ గ్రంథులు, మెదడు పొరలలో, రక్తం ద్వారా(మిలియరీ టి.బి.), వెన్నెముక, ఇతర అవయవాల్లో హెచ్చు-తగ్గులుగా ఏర్పడుతుంది. ఇది అవయవాల్లో కనిపించే హిస్టాలాజికల్ గాయం అని చెప్పవచ్చు.

## క్షయ వ్యాధి ఎక్స్‌పోజర్

రోగికి సన్నిహితంగా లేదా ఎక్కువసేపు సపర్యలు చేసేవారిని టిబి ఎక్స్‌పోజర్ అంటారు. అయితే షేక్ హ్యాండ్ ఇచ్చినా, ఆహారాన్ని ఎంగిలి చేసినా, తాకినా వారి టవల్స్, బెడ్‌షీట్స్ వాడినా ఈ వ్యాధి రాదు. ప్రతి ముగ్గురిలో ఒకరు క్షయ వ్యాధి ఎక్స్‌పోజర్‌గా మారుతారు.

## టి.బి.కాంటాక్ట్ ట్రేసింగ్

క్షయ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తితో పరిచయం వున్న వ్యక్తుల్ని సకాలంలో గుర్తించి, వారికి పరీక్షలు, నివారణ చర్యలు, చికిత్స, కౌన్సెలింగ్, నిరోధించడానికి నిర్వహించే ప్రక్రియను 'కాంటాక్ట్ ట్రేసింగ్' అంటారు. టి.బి. చికిత్స సమయంలో, తర్వాత సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

రోగి వయస్సు, అనారోగ్య పరిస్థితులు, రిస్క్ ఫ్యాక్టర్స్‌ని బట్టి చికిత్స మారుతుంది. చికిత్స కోర్సు పూర్తి చేయడం చాలా ముఖ్యం.

హెచ్‌ఐవి సోకినవారు ఆక్టివ్ క్షయ బారిన పడే అవకాశం 20-30 రెట్లు ఎక్కువ. 90 సంవత్సరాల వాక్సిన్, 60 సంవత్సరాల కీమోథెరపీ ఉన్నపనపటికీ ఇది ఒక అంటువ్యాధిగా మిగిలిపోయింది. కాబట్టి 2050 నాటికైనా క్షయ వ్యాధి నిర్మూలన ఒక ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందా? ప్రపంచ దేశాలకి ఒక సవాల్‌గా ప్రపంచ ఆరోగ్య సంరక్షణకి తలనొప్పిగా ఆరోగ్య సమస్యగా మిగులుతుందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.




## నివారణ సాధ్యమేనా?

**క్షయ వ్యాధి టీకాలు:** క్షయ నుండి రక్షణగా ఇమ్యూనో థెరపీని మొదటిసారిగా 1890లో రాబర్ట్‌కోచ్ ప్రతిపాదించాడు. ఇది విజయవంతమైన, శాశ్వత నిర్వహణను ప్రోత్సహించడానికి సమర్థవంతమైన టీకా ఆవశ్యకతను తెలియచేశారు.

1921లో మొట్టమొదట డా॥ ఆల్బర్ట్ కాల్మెట్, కామిల్లె గ్వెరిన్ అనేవారు క్షయకి వాక్సిన్ కనుగొనడంతో వారి పేరు మీద బిసిజి వాక్సిన్/టీకాని వ్యాధి నిరోధకంగా ఇస్తున్నారు. దీన్ని పుట్టినప్పుడు/పుట్టిన తర్వాత పది వారాలలోపు వేయవచ్చు. అయితే వ్యక్తి వయస్సు, బిసిజి ఇచ్చే ఫ్రీక్వెన్సీ ఎల్లప్పుడూ దేశం నుండి దేశానికి మారుతూ ఉంటాయి.

భారత్‌లో 1948లో బిసిజి మాస్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌ని ప్రవేశపెట్టారు. బిసిజి 0.80 శాతం వరకు 15 సంవత్సరాల పాటు క్షయ వ్యాధిని నివారించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. అయితే ఇది వేసినప్పటికీ క్షయ వ్యాధి సంక్రమణ జరిగే అవకాశముంది. వివిధ క్షయ వ్యాధి టీకాలు వివిధ అభివృద్ధి దశల్లో ఉన్నాయి.



1962లో భారత్ ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూలన ప్రోగ్రామ్‌ని అమలులోకి తెచ్చింది. 1993లో డబ్ల్యుహెచ్‌ఓ క్షయని గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. 50-60 సంవత్సరాలకు పైగా నియంత్రణ చర్యలు అమలులో ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ క్షయ నిర్మూలన, డిటెక్ట్, ట్రీట్‌మెంట్, ప్రివెన్షన్ అని నాలుగు దశలుగా నిర్మితమైంది.

దీనికి రెండు ప్రధాన విధానాలుగా టీకాతో పాటు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు సామాజిక, ఆర్థిక వనరుల తోడ్పాటు, సంక్రమణ వ్యాప్తిని నిరోధించడం, మంచి వెంటిలేషన్, పరిశుభ్రత, ప్రారంభ రోగ నిర్ధారణ, చికిత్సని చేపట్టారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రస్తుత ఇన్ఫెక్షన్/గతంలో ఉన్న ఇన్ఫెక్షన్ మధ్య ఉన్న తేడాని గుర్తించలేవు. కాబట్టి ఎవరికి ఇన్ఫెక్షన్ ఉందో, ఎవరికి తగ్గిపోయిందో పరీక్షల ద్వారా తెలుసుకోవడం కష్టం. కాబట్టి వాక్సిన్ తయారీలో ఆలస్యం ఏర్పడుతుంది. టీకా అధ్యయనానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఎందుకంటే కొందరిలో ఆక్టివ్‌గా ఉంటే, కొందరిలో లేటెంట్‌గా ఉండడమే. టీకా ప్రభావవంతంగా పని చేసి భారత జనాభాకి అందించగలగడమే దీని లక్ష్యం. కానీ బిసిజి వృద్ధి చెందిన (ఆక్టివ్ క్షయ) క్షయ నుండి ఎలాంటి రక్షణ అందించలేదని 1999లో జరిపిన పరిశోధనలు తెలుపుతున్నాయి. క్షయని పేదల వ్యాధి అని అంటారు. దాని కారణాల్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. భారత్ అన్ని రకాల క్షయ వ్యాధుల్ని నలభై శాతం, ఇన్ఫెక్షువస్ క్షయని యాభై శాతం మాత్రమే తగ్గించినట్లు మెడికల్ పరిశోధన తెలుస్తోంది. డబ్ల్యుహెచ్‌ఓ మూడంచెల పథకం(నివారణ-చికిత్స), పౌష్టికాహారం, వ్యాప్తిని, వ్యాధిని నివారించే వ్యాక్సిన్) పై ప్రపంచ వ్యాప్తంగా విశేష కృషి సల్పుతుంది. క్షయ వ్యాధి శాశ్వతంగా నిర్మూలం కావాలని ఆశిద్దాం.

# నెరవేరిన ఆశయం

కథ

**ములుగు లక్ష్మీ మైథిలి**

**అదొక ధనవంతుల ఇల్లు, ఆ ఇల్లంతా ఖరీదైన ఫర్నీచర్ తో, గోడల మీద అందమైన పెయింటింగ్ చిత్రాలతో చాలా అందంగా అలకరించబడి ఉంది. అక్కడ ఉన్న ప్రతీ వస్తువును జాగ్రత్తగా తుడుస్తోంది సీతాలు.**

**అవి ఏ మాత్రం కిందపడి పగిలినా... వాటి మూల్యం చెల్లించలేని నిస్సహాయురాలు, ఆ హాలులో టేబుల్ ని కూడా శుభ్రం చేస్తూ గోడమీద ఉన్న ఒక ఫొటోను తదేకంగా చూడసాగింది సీతాలు.**

పసివాడిని చేతులతో ఎగరేస్తూ ఆడిస్తున్న ఫొటో.

ఆ పిల్లాడు ఆనందంతో గలగలా నవ్వుతున్నాడు. పసిపిల్లల నవ్వుల్లో ఏదో మహత్తు ఉంటుంది. ఎన్ని కష్టాలు ఉన్నా, పసివారి నవ్వులు చూస్తే చాలు... ఎవరి మనసైనా ఎంతో తేలిక పడుతుంది.

తన బిడ్డను అట్లా ఆడించేంత తీరుబడి తనకు ఎక్కడుంది? ఆ ఇంట్లోనూ, ఈ ఇంట్లోనూ చాకిరీ చేయటానికే సమయం సరిపోవడం లేదు. ఆడించడానికి, జోల పాడటానికి కూడా తీరికలేని పనులే.

తన కూతురు బోసి నవ్వుల్లో, చిట్టి మాటల్లో కూడా యజమానుల కేకలే వినిపిస్తూ ఉంటాయి. "ఈరోజు ఆలస్యం అయిందని, ఆ పని, ఈ పని కాలేదని అరుపులే... నిద్రలో కూడా అవే వినిపిస్తున్నాయి" అనుకుంటూ ఆలోచిస్తున్న సీతాలు యజమాని పిలుపుకు మళ్ళీ పనిలో పడింది.

కట్టుకున్న మొగుడు తాగుడు వ్యసనంలో పడి ఇంటికి రాకపోయినా, తన కూతురు మీదే ప్రాణాలు పెట్టుకుని బతుకుతోంది సీతాలు. ఆ చిన్ని మనసుకు... తన బాధలు అర్థమయ్యాయేమో, ఎప్పుడూ ఏ విషయంలోనూ పేచీ పెట్టేది కాదు మల్లి.

ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పని చేసినప్పుడు, వాళ్ళు ఇచ్చిన విరిగిపోయిన బొమ్మలతోనే ఆడుకునేది. వాళ్ళు ఏది పెట్టినా తినేది. పదేళ్ల వయసు వచ్చినా కూడా బొమ్మలు కావాలని, చాక్లెట్స్ కావాలని అల్లరి చేసేది కాదు.

సీతాలు తనతో పాటు, తాను పని చేసే ఇళ్ళకు కూతురిని తీసుకుని వెళ్ళేది. అక్కడ వారి పిల్లలు ఏవో చదువుకుంటూ కూర్చునప్పుడు... వారినే గమనిస్తూ ఉండే మల్లి చూపులకు అర్థం తెలిసింది సీతాలుకు.

మల్లిని అదే విషయాన్ని అడిగింది సీతాలు.

"మల్లీ! ఆ పిల్లలు సదువుతుంటే అట్టా చూస్తూ ఉన్నావు ఎందుకు?" అంటూ అడిగింది పిల్ల మనసు తెలుసుకోవాలని..

"అమ్మా! నేను కూడా సదువుకుంటానమ్మా. అట్టా పుస్తకాలు చదవాలంటే నేను ఏం చేయాలో సెప్పమ్మా" అంటూ ఆ పిల్లల వైపు చూపిస్తూ చెప్పింది మల్లి.

"తన కూతురు కూడా... తనలా పనిమనిషి కాకూడదని, చదువుకుని పది మందిలో గొప్పగా ఉండాలని, తనకూ కోరికే. కానీ ఇప్పుడు తాను ఉన్న పరిస్థితుల్లో మల్లిని చదివించడమంటే.. మాటలు కాదు.

స్కూల్ ఫీజులు, పుస్తకాలు అన్నీ తను సమకూర్చగలదా?" అనుకుంటూ దిగులు పడుతోంది సీతాలు.

"పేదరికంతో బతికేవాళ్లకి కూడా ఒక లక్ష్యానికి చేరాలని, ఎన్నో కథలు, కలలు ఉంటాయి, కానీ తన దగర అంత స్థోమత ఉండకపోవడంతో, తన బిడ్డ కూడా కోరికలను పూర్తిగా వదిలేసుకోవాల్సిందేనా?"



సీతాలుకు ఏ పని చేస్తున్నా అవే ఆలోచనలు వస్తున్నాయి. మల్లిని ఎలా అయినా చదివించాలని బలంగా అనిపించసాగింది.

తను పని చేస్తున్న ఇంటి యజమాని రాఘవరావుతో "అయ్యా! నా కూతురు మల్లిని సదివించాలనుకుంటున్నా. ఈ ఊళ్లో బడిలో ఎలా చేర్పించాలో నాకు తెలీదు. అక్షరంముక్క రాని దాన్ని ఏమన్నా కాగితాల మీద సంతకాలు పెట్టాలన్నా నాకు చేతకాదు. నా బిడ్డను కూడా మీ పిల్లలు చదువుకునే బడిలోనే చేర్పించడయ్యా" అంటూ అడిగింది వినయంగా సీతాలు.

"ఏంటీ! అంట్లు తోముకునే నీకు, మా పిల్లలతో పాటు కలిసి బడికి పంపిస్తావా? కూలీపని చేసేవారి పిల్లలు కూలీలే కావాలి. అనవసరంగా లేనిపోని ఆశలు పెట్టుకోవద్దు. వెళ్ళి నీ పని చూసుకో". అంటూ గట్టిగా కసురుకున్నాడు. రాఘవరావు.

అతని మాటలు వినగానే సీతాలు చాలా సేపు బాధపడింది. కానీ పెద్దవాళ్లతో గొడవ ఎందుకనీ, మల్లిని తీసుకుని మౌనంగా బయటికి నడిచింది.

> **మల్లి ఎగ్జామ్‌లో విజేతగా నిలవటం ద్వారా, తన కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని కూతురు ప్రతిభకు సంతోషపడుతూ, ఇన్నాళ్లకు తన ఆశయం నెరవేరిందని సంతోష పడుతూ... కూతురు విజయానికి పొంగిపోయింది సీతాలు.**

మరుసటి రోజు నుంచి మరో రెండు ఇళ్లు కుదుర్చుకుంది సీతాలు. తానే మల్లిని తీసుకుని వెళ్లి గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పించింది.

మల్లికి చిన్నతనం నుంచే చదువు మీద ఆసక్తి ఉండటంతో ప్రతి తరగతిలోనూ మంచి మార్కులు సాధించింది. పదవ తరగతిలో మెరిట్ రావటంతో ఇంటర్ పూర్తి చేసి, ర్యాంకు సంపాదించింది. ముఖ్యంగా పేద అమ్మాయిలు, వారి నేపథ్యం లేదా పరిస్థితులతో సంబంధం లేకుండా కృషి, అంకితభావం, పట్టుదలతో కోరుకున్నది సాధించగలరని మల్లి నమ్ముతుంది. ఇబ్బందులు. అడ్డంకులు ఉన్నప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో ఇతరులకు సరైన తోడ్పాటు అందిస్తే, ఏదైనా సాధించగలరని ఋజువు చేసింది మల్లి. వీలైనప్పుడల్లా అన్ని విధాలుగా తల్లికి సహాయపడేది మల్లి.

............

ఆ రోజు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలు విడుదల కోసం మల్లి, సీతాలు, రాఘవరావు టి.విలో చెప్పే న్యూస్ కోసం ఎదురు చూస్తున్నారు. కొద్దిసేపటికి తర్వాత యు.పి.పి.యస్సీ వారు ఫలితాలు వెల్లడించటంతో ఆత్రంగా ఎదురు చూస్తున్న రాఘవరావుకి నిరాశే మిగిలింది. కారణం తన కొడుకు ఉత్తీర్ణత సాధించలేదు. కానీ తన దగ్గర పనిచేసే సీతాలు కూతురు మల్లి స్టేట్‌లో సెకెండ్ ర్యాంకు సాధించటంతో విస్తుపోయాడు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్కూల్‌లో, కాలేజీల్లో చదివించి, ఎన్నో ఫీజులు చెల్లించి ట్యూషన్లు పెట్టించినా తన పిల్లలు చదువులో వెనుకబడి, ఇపుడు కొడుకు ర్యాంకు తెచ్చుకోలేకపోయాడు.

మల్లి ఎగ్జామ్‌లో విజేతగా నిలవటం ద్వారా, తన కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని కూతురు ప్రతిభకు సంతోషపడుతూ, ఇన్నాళ్లకు తన ఆశయం నెరవేరిందని సంతోష పడుతూ కూతురు విజయానికి పొంగిపోయింది సీతాలు.

ఒకప్పుడు "పనిమనిషి కూతురుకి చదువెందుకు?" అన్న రాఘవరావుకు, తన దగ్గర పని చేసే సీతాలు కూతురు మల్లి విజయం చెంపదెబ్బలా అనిపించి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఎవరైనా గెలుస్తారు. చదువు విలువ తెలియనప్పుడు ఎంత సంపద ఉంటే ఏ లాభం? విద్యతో పాటు వినయం కూడా ఉండాలి అనే లేనప్పుడు "కోటేశ్వరుడైనా ఓడిపోతాడు" అనుకుంటూ మల్లిని మనస్ఫూర్తిగా అభినందించాడు.




పోలీసు: "దొంగతనం చేయడానికి ఎప్పుడూ ఆ ఇంటికే వెళ్తావెందుకు?"

దొంగ: వాస్తు పరంగా ఆ ఇల్లు నాకు బాగా కలిసొచ్చింది సార్!

.................

మొదటి వ్యక్తి: మగవాడికి ధైర్యం రావాలంటే మందు కొడతాడు. మరి ఆడవాళ్లకి ధైర్యం రావాలంటే ఏం చెయ్యాలి?

రెండవవాడు: మెడలో తాళి పడగానే వాళ్లకి ధైర్యం వస్తుంది?

.................

కస్టమర్: పేపర్ దోసెలు తెచ్చావు కదా, ఇక ఫ్యాన్ వెయ్యి.

సప్లయర్: వద్దండీ, ఫ్యాన్ గాలికి దోసెలు ఎగిరిపోతాయి.

.................

టీచర్: భాస్కర్, తొమ్మిది ఇన్ టూ తొమ్మిది ఎంతరా?

భాస్కర్: చెప్పను.

టీచర్: ఎందుకు చెప్పవు?

భాస్కర్: నన్ను ప్రశ్నలు అడగొద్దని ప్రతీ నెలా మా నాన్న మీకు ఎక్స్‌ట్రా డబ్బులు ఇస్తున్నాడుగా!

.................



టీచర్: చింటూ! నేను వంద రూపాయలు, సోషల్ టీచర్ వంద రూపాయలు, లెక్కలు టీచర్ వంద రూపాయలు, తెలుగు టీచర్ వంద రూపాయలు ఇస్తే అంతా కలిపి మొత్తం నీ దగ్గర ఎంత ఉంటుంది?

చింటూ: ఆ! ఎందుకులెండి? అవన్నీ జరగని పన్లు సార్.

.................

భర్త: ఏమేవ్! ఎక్కడున్నావు? ఆఫీసుకు లేటవుతోంది. నా హెల్మెట్ ఎక్కడ పెట్టావు?

భార్య: టూత్‌పేస్టు, టూత్ బ్రష్‌లు వేసి బాత్‌రూం గోడకు తగిలించాను, చూడండి.

– వైదా ఈశ్వరరావు, విశాఖ

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***

# అధికార భాషగా తెలుగు

ఆచార్య టి.గౌరీశంకర్

సుమారు అయిదు వేల సంవత్సరాల క్రితమే మూల ద్రావిడ భాష నుంచి విడిపోయి క్రీ.శ.5,6 శతాబ్దుల కాలం నాటికే తెలుగు ఒక ప్రత్యేక భాషగా పరిపుష్టి నొందిందని భాషాశాస్త్ర పరిశోధకులు అంటున్నారు. అనాటి నుంచి క్రీ.శ. 17వ శతాబ్ది వరకు తెలుగు నేలను పరిపాలించిన వివిధ రాజవంశాల ఏలుబడిలో సంస్కృతం, ప్రాకృతం, పర్షియన్, అరబ్బీ వంటి భాషలతో పాటు తెలుగు కూడా రాజభాషగా, అధికార భాషగా కొనసాగింది.

14వ శతాబ్దంలో భారతదేశాన్ని సందర్శించిన ఇటలీ దేశ భాషా పండితుడు 'నికోలస్ కోంటి' మన దేశంలోని భాషలన్నింటిని పరిశీలించి ఒరిస్సాలో జరిగిన ఒక సభలో "తెలుగు ఈజ్ ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నాడు. దీని అర్థం పశ్చిమ దేశాలలో ఇటలీ భాషకు ఉండే లక్షణం మన దేశంలోని భాషలలో తెలుగు భాషకు ఉందని. అంటే ఇటలీ భాష Vowel Ending Language, అదే విధంగా తెలుగు భాష కూడా అచ్చులతో అంతమయ్యే అజంత భాష, ఇది



లయాన్వితమై, సంగీతానికి ఒదిగిపోయే లక్షణాన్ని కలిగి శ్రవణ సుభగత్వం అందిస్తుంది. అందుకే త్యాగరాజ స్వామి కీర్తనలు అంతటి ప్రాచుర్యాన్ని పొందాయి అంటారు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు "దేశభాషలందు తెలుగు లెస్స" అని కొనియాడాడు. తమిళుడైన అప్పయ్య దీక్షితులు అనే సంస్కృత పండితుడు–

**"ఆంధ్రత్వమాంధ్ర భాషా చ**
**ప్రాభాకర పరిశ్రమః**
**తత్రాపి యాజుషీ శాఖా**
**నాల్పస్య తపసః ఫలమ్'**

అని అన్నాడు. అంటే తెలుగు వానిగా పుట్టి, తెలుగు మాతృభాషగా కలిగి ఉండడం పూర్వ జన్మ సుకృతమని భావించాడు. తమిళ జాతీయకవి సుబ్రహ్మణ్య భారతీయార్–

**"సింధు నదియన్ ఇసై మీదినిలే**
**ఛేర నన్నటియన్ పెణళుదానె**
**సుందర తెలుంగు నిళ్ పాట్టిసయిత్తు**
**తూణిగళ్ వూట్టి విలాయడి వరువమ్"**

అన్నాడు. అంటే ఒక చక్కటి సాయంకాలం మలయ పర్వతం మీదుగా వీస్తున్న చల్లని గాలుల్లో, సింధునదిలో కేరళ యువతి ఒయ్యారంగా నడుపుతున్న నావలో, ఆమె పాడే తెలుగు పాటను వింటూ ప్రయాణం చేయడం ఒక మధురానుభూతి అని ఆయన అభిప్రాయపడ్డాడు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

**"ఒక్క సంగీతమేదో పాడునట్లు**
**భాషించునప్పుడు వినిపించు భాష**
**...... ...... .....**
**తనర ఛందస్సులోని యందమ్ము నడక**
**తీర్చి చూపించినట్టిది తెలుగు భాష"**

అంటూ అభివర్ణించాడు. పద్య ప్రక్రియ, అవధాన కళ వంటివి తెలుగు భాషలోనే కనిపిస్తాయంటారు. ద్వ్యర్థి, త్ర్యర్థి వంటి కావ్యాలు, పద్యాన్ని ఎటు నుంచి చదివినా అక్షరాలు ఒకటిగానే ఉంటాయి కానీ అర్థాలు వేరుగా వచ్చేవి; ముందు నుంచి చదివితే రామాయణం, చివరి నుంచి చదివితే మహాభారతం అర్థాలు వచ్చే పద్యాలు తెలుగులోనే ఉన్నాయంటారు. ఇంకా తెలుగులో ఏకాక్షర పద్యాలు ఉన్నాయి. తెలుగు భాషలో ఉన్నన్ని సామెతలు, నానుడులు మరే భాషలో లేవంటారు.

ప్రపంచంలో ఇప్పుడు ఉన్న 7,164 భాషలలో ప్రజల చేత విరివిగా మాట్లాడబడే భాషలలో తెలుగు 14వ స్థానంలో ఉంది. ఇక భారతదేశంలో అత్యధికులు మాట్లాడే హిందీ భాష తరువాత ఒకప్పుడు రెండవ స్థానంలో ఉన్న తెలుగు భాష ఇప్పుడు నాల్గవ స్థానంలో ఉంది. రెండవ స్థానంలో బెంగాలీ, మూడవ స్థానంలో మరాఠీ భాషలున్నాయి. బ్రిటీష్ పాలనా కాలంలో 1943 నాటి నాణేల మీద ముద్రించిన నాలుగు భాషలలో తెలుగు ఒక భాషగా ఉండేది. 2008 అక్టోబర్ 31వ తేదీన భారత ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన భాష హోదాను ప్రకటించింది. 2012లో International Alphabet Association ఉత్తమ లిపిగా గుర్తించారు. మొదటి స్థానంలో కొరియా లిపి నిలిచింది. సమస్త వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగే పద సంపద, సామర్థం తెలుగు భాషకు ఉందని జె.బి.యస్. హాల్డెన్ అనే విదేశీ పండితుడు పేర్కొన్నాడు. తెలుగు భాషను మాట్లాడేటప్పుడు, ఆ భాషా ధ్వనుల ఉచ్చారణ వల్ల మన శరీరంలోని 72 వేల న్యూరాన్లు యాక్టివేట్ అవుతాయని శాస్త్రీయంగా నిరూపించబడిందని అంటారు. ఇంతటి ప్రత్యేకత, విశిష్టత కలిగిన తెలుగు భాష ఇప్పుడు బోధనా భాషగా, పాలనా భాషగా మరింత ముందుకు వెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ ఉదంతాన్ని గుర్తు చేసుకోవలసి ఉంది.



1947లో దేశ స్వాతంత్ర్యానంతరం భారతదేశం ఇండియా, పాకిస్తాన్లుగా రెండుగా విడిపోయింది. భౌగోళికంగా పాకిస్తాన్ తూర్పు, పశ్చిమ పాకిస్తాన్లుగా కొనసాగాయి. 1948లో పాకిస్తాన్ ప్రభుత్వం అక్కడ ఉర్దూను అధికార భాషగా ప్రకటించింది. కానీ తూర్పు పాకిస్తాన్లోని అత్యధిక ప్రజల మాతృభాష బెంగాలీ అయినందువల్ల, వారు బెంగాలీని అధికార భాషగా ప్రకటించాలని పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. దీనిని అణచివేయడానికి ప్రభుత్వం 1952 ఫిబ్రవరి 21న ఢాకా హైకోర్టు వద్ద జరిపిన కాల్పులలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చడంతో చివరికి ప్రభుత్వం దిగి వచ్చి, 1956లో బెంగాలీని అధికార భాషగా ప్రకటించింది. ఆ తరువాత అక్కడి ప్రజలు భాషా ప్రాతిపదికపై పోరాడి చివరికి 1971లో ప్రత్యేక దేశంగా బంగ్లాదేశ్ను సాధించుకొన్నారు. ప్రపంచ చరిత్రలోనే మాతృభాష కోసం ఉద్యమించి, అసువులు బాసి, భాష ద్వారా ఒక ప్రత్యేక దేశాన్నే సాధించుకొన్న ఘనత బంగ్లాదేశ్ ప్రజలది. అంటే మాతృభాష పట్ల వారికున్న అభిమానం ఎంతటిదో ఈ సంఘటన రుజువు చేస్తుంది. దీనిని గుర్తించిన యునెస్కో 1999 నవంబర్ 17వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 21వ తేదీని "అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం"గా జరుపుకోవాలని ప్రకటించింది.



1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు అధికార భాష అయింది. తెలంగాణ విలీనం అనంతరం 1956లో ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవిర్భవించింది. తెలుగును అధికార భాషగా నిర్ణయిస్తూ ప్రభుత్వం 1966 మే 14న అధికార భాషా చట్టాన్ని తీసుకొని వచ్చింది. అంతకు పూర్వమే 1946-47లో అంటే స్వాతంత్ర్యానికి పూర్వమే తూర్పు గోదావరి జిల్లాలో, 1950 -52లో తెలంగాణలోని తూర్పు ప్రాంతాలలో తెలుగును తాలూకా స్థాయిలో అమలు జరపడానికి కొంత ప్రయత్నం జరిగింది. అప్పటికే దేశంలోని బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, మద్రాసు, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, సౌరాష్ట్ర, పంజాబ్, అస్సాం తదితర రాష్ట్రాలు తమ అధికార భాషలను ప్రకటించుకొని శాసనాలు చేశాయి. అధికార భాష అమలుపై కేరళ ఒక సంఘాన్ని నియమించింది. ఆంధ్రప్రదేశలో 1964లో వావిలాల గోపాలకృష్ణయ్య ప్రతిపాదించిన అనధికార బిల్లును తొలుత ప్రజాభిప్రాయానికి, ఆ పైన సెలక్ట్ కమిటీకి పంపారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, విద్యామంత్రి పి.వి. నరసింహారావు దానికి బదులుగా ప్రభుత్వ బిల్లు తీసుకొని వచ్చారు. దాన్ని శాసనసభ 1966 మే 14న ఆమోదించింది. ఆనాటి నుంచి శాసన రీత్యా తెలుగు రాష్ట్రంలో తెలుగు అధికార భాష అయ్యింది.

1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలో ఒక ప్రత్యేకాధికారిని నియమించి, అధికార భాషగా తెలుగు అమలు కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. అధికార భాషా శాఖను అప్పటి విద్యామంత్రి మండలి వెంకట కృష్ణారావుకు అప్పగించింది. 1967లో పి.వి. నరసింహారావు అధ్యక్షతన ఏర్పడిన సమీక్షా సంఘం 1971లో నివేదికను సమర్పిస్తే- 1974 మార్చి 5వ తేదీన పైన తెలిపిన అధికార భాషా విభాగం ఏర్పడింది. 1974 మార్చి 19న ప్రభుత్వ ఉత్తర్వు నం.199 చట్టం 9వ విభాగం ద్వారా అధికార భాషా కమీషన్ ఏర్పడింది. వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షులుగా, మరో నలుగురు సభ్యులుగా ఈ కమీషన్ పని చేయడం ప్రారంభించింది. అన్ని శాఖలకు చెందిన తాలూకా, అంతకు కింది స్థాయి కార్యాలయాల్లో శాసనేతరమైన అంశాలకు తెలుగు వాడాలని, ఆంగ్లం వాడరాదని ప్రభుత్వం కచ్చితంగా చెప్పింది. 1976లో ఒక అడుగు ముందుకు వేసి జిల్లా స్థాయి కార్యాలయాలకు దీన్ని విస్తరింపజేసింది. 1979లో శాఖాధిపతుల స్థాయి వరకు శాసనేతరమైన అంశాలకు తెలుగును వాడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు శాఖాధిపతుల స్థాయి వరకు శాసనేతరమైన అంశాలకు తెలుగును అధికార భాషగా విస్తరింపజేశారు. 1983 నుంచి దీన్ని సచివాలయ స్థాయిలో ప్రవేశపెట్టారు. 1988 అక్టోబర్ 28న ప్రభుత్వం చట్టపరమైన ఒక ప్రకటనను వెలువరించింది. దాని ప్రకారం శాసన పరమైన అంశాలకూ తెలుగును వాడవలసి ఉంటుంది. అదొక విప్లవాత్మకమైన నిర్ణయం. ప్రజల భాషతో పరిపాలన జరగడమన్నది ప్రజాస్వామ్య పటిష్టతకు, పరిణతికి అత్యంత ఆవశ్యకం. పరిపాలన ఎట్లా, ఏ విధంగా జరుగుతుందో, దాని ఫలితాలను అనుభవించే ప్రజలకు క్షుణ్ణంగా తెలియాలి. వారి ప్రమేయం లేని, వారి శ్రద్ధాసక్తులతో మమేకం కాలేని ప్రభుత్వ పరిపాలన నిష్ప్రయోజనం. అధికార భాషా సంఘం పరిధి ప్రభుత్వ కార్యాలయాలలోని పాలనా వ్యవహారాలలో తెలుగు ఎంతవరకు అమలు అవుతోంది అందుకు తీసుకోవలసిన చర్యలేమిటో ప్రభుత్వానికి సూచించడం వరకే.. దానిపై ముందుకు వెళ్ళడం ప్రభుత్వం చేయవలసిన పని, అక్కడ ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు అధికార భాషా సంఘం 2014 వరకు బాగానే పని చేసింది. ముఖ్యంగా న్యాయశాఖలో అంటే న్యాయస్థానాలలో అక్కడక్కడ తెలుగులో తీర్పులు వెలువడ్డాయి. 2014లో రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లుగా విడిపోయాక రెండు రాష్ట్రాలలో పేరుకు అధికార భాషా సంఘాలకు అధ్యక్షులను నియమించినా జరిగిందేమిటో పెద్దగా ఎవరికీ తెలియరాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ప్రస్తుతం ఉభయ రాష్ట్రాలలో అధికార భాషా సంఘం ఊసే లేదు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ శాఖలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని ఉత్తర్వులు జారీ చేయడం కొంతమేర సంతోషాన్ని కలిగించింది. ఒకటి, అరా జి.వో.లు కూడా తెలుగులో వెలువడ్డాయి. న్యాయస్థానాలలో కూడా ఒకటి, రెండు చోట్ల తీర్పులు తెలుగులో వెలువడ్డాయి. అయితే ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంతవరకు అధికార భాషా సంఘాలకు అధ్యక్షులను, సభ్యులను నియమించకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు ఆనాటి స్ఫూర్తిని గ్రహించి అధికార భాషా సంఘాలకు అధ్యక్షులను, సభ్యులను నియమించి తెలుగు భాషను పాలనా భాషగా అమలు పరచడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

# మూడు రకాల బొమ్మలు

యామిజాల జగదీశ్

అది అవంతీపురం. రాజు రవివర్మ. అతని తెలివితేటలు అపారం. రాజులకు ఏదైనా సందేహాలు వస్తే ఆస్థాన కవిపండితులను అడిగి వాటిని నివృత్తి చేసుకోవడం సహజం. కానీ ఈ రాజు అలా కాదు. ఇతరులకు సందేహాలు వస్తే తిన్నగా రాజు వద్దకు వచ్చి నివృత్తి చేసుకుంటుంటారు.

అలాగే ఓ పెద్దాయన ఒకరోజు రాజుగారి వద్దకు వచ్చారు.

ఆయన చేతిలో మూడు బొమ్మలు ఉన్నాయి. మూడు బొమ్మలూ ఒకేలాంటివి. అవి చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. ఏ మాత్రం తేడా కనిపించడం లేదు.

“ఏమిటీ బొమ్మలు?” అని అడిగాడు రాజు. “నాకు తెలిసిన వ్యక్తిని నాకు మూడు రకాల బొమ్మలు కావాలని అడిగాను. అతను చాలా తెలివైనవాడు. అతను ఈ బొమ్మలను చేసిచ్చాడు. కానీ ఇందులో ఓ చిక్కు సమస్య తలెత్తింది” అన్నాడు.



“ఏమిటి సమస్య?” అని అడిగాడు రాజు.

“నేను అతనిని మూడు రకాల బొమ్మలు అడిగాను. కానీ అతను మూడు బొమ్మలూ ఒకేలాంటివి చేసిచ్చాడు” అన్నాడు.

“మరి అటువంటప్పుడు అతనినే అడగవలసింది కదా ఎందుకిలా చేసావని?” అని రాజు అన్నాడు.

“మీరడిగినట్టే నేను అప్పుడే అడిగాను. ఎందుకిలా ఒకేలాంటి బొమ్మలు చేసిచ్చావని...కానీ అతను మూడూ మూడు రకాల బొమ్మలని” చెప్పిచ్చాడు అని అన్నాడు పెద్దాయన.

“ఈ మూడు బొమ్మలూ మూడు రకాలు. మూడు రకాల మిత్రుల్లాంటి వారట! అని చెప్పాడు. అయితే అతనలా చెప్పాడు కానీ నాకేమీ అర్థం కాలేదు” అని అన్నాడు పెద్దాయన. అందుకే మీ వద్దకు వచ్చానన్నాడు.

“సరే...ఈ బొమ్మలు ఇటివ్వండి...” అని రాజు ఆ పెద్దాయన నుంచి బొమ్మలు అడిగి తీసుకున్నాడు.

వాటిని తీసుకుని రాజు లోపలి గదిలోకి వెళ్ళాడు. కాస్సేపు తర్వాత సభలోకి వచ్చాడు. పెద్దాయనతో ఇలా చెప్పాడు...

“ఈ బొమ్మలు చేసిచ్చినతను చెప్పింది సబబే. మూడూ మూడు రకాల బొమ్మలే....ఇదిగో మొదటి బొమ్మ. ఇది ఉత్తమమైన మిత్రుడు లాంటి బొమ్మ. దీనిని చేసిన అతను నిజంగా మేధావి” అన్నాడు రాజు.

పెద్దాయనకు ఏమీ అర్థం కాలేదు. చూడ్డానికి మూడు ఒకేలా ఉన్నాయి కదా...అనుకున్నాడు.

అప్పుడు రాజు ఇలా చెప్పుకొచ్చాడు...

“ఆ మూడు బొమ్మలనూ ఓ బల్ల మీద ఉంచాడు. ఒక సన్నని తీగ తీసుకున్నాడు. దానిని మొదటి బొమ్మ చెవిలో దూర్చాడు. అది కొంత దూరం పోయి ఆగిపోయింది.

అనంతరం రెండో బొమ్మ తీసుకున్నాడు. ఒక చెవిలో ఆ తీగను దూర్చాడు. అది నోట్లోంచి ఇవతలకు వచ్చింది. ఇక చివరగా మూడో బొమ్మ చెవిలో దూర్చాడు. ఆ తీగ ఒక చెవిలో నుంచి పోయి మరొక చెవి నుంచి బయటకు వచ్చింది.

దీనిని బట్టి నువ్వు తెలుసుకోవలసింది అవి మూడూ వేర్వేరు బొమ్మలని. ఎలాగంటావా....చెప్తాను విను. మొదటి బొమ్మ ఉంది చూసావూ...అటువంటి మిత్రులు ఎలాంటి వారో తెలుసా...మన కష్టాన్ని వారితో చెప్తే వారు దానిని ఎవరితోనూ చెప్పరు. అంతేకాదు, ఇతరులెవరికీ తెలియకుండా మనకు సహాయం చేస్తారు. చేసిన ఆ సహాయాన్ని కూడా ఎవరితోనూ చెప్పరు. అటువంటి మిత్రుడిలాంటి మొదటి బొమ్మ చెవిలో దూర్చిన తీగ లోపలే ఉండిపోయింది.

ఇక రెండో బొమ్మ విషయానికి వస్తాను. చెవిలో దూరిస్తే అది నోట్లోంచి బయటకు వచ్చింది. ఇటువంటి మిత్రులూ మనలో ఉంటారు. వారికి ఏదైనా చెప్తే విని నలుగురితో చెప్పి మన కోసం సహాయం అడుగుతారు. ఆ నలుగురూ ఇచ్చింది మనకిచ్చి సాయమందిస్తారు. ఇటువంటి మిత్రులు రెండో బొమ్మ రకం లాంటి వారు.

ఇక మూడో బొమ్మ విషయానికి వస్తాను. ఆ బొమ్మ చెవిలో దూర్చిన తీగ కాస్తా రెండో చెవిలో నుంచి ఇవతలకు వచ్చింది. ఇటువంటి మిత్రులు ఎటువంటి వారంటే, మనం ఒక మిత్రుడితో మన కష్టం గురించి చెప్తే చెవి యొగ్గి విన్నట్టు నటిస్తాడు. ఆ విషయాన్నే మరొకరికి చెప్తాడు. అతను ఇంకొకడికి చెప్తాడు. ఇలా మనం చెప్పిన కష్టమంతా పది మందికీ తెలిసేలా చేస్తాడు మూడో రకం మిత్రుడు. అతనలా చెప్పడం వల్ల మనకు జరిగే కష్టం గురించో నష్టం గురించో ఏ మాత్రం ఆలోచించడు. ఇప్పుడు తెలిసిందా ఆ మూడు బొమ్మల మధ్య ఉన్న తేడా.”

.............

చదువుకునే పిల్లల్లోనూ ఇలా మూడు రకాల వాళ్ళు ఉంటారు. కొందరు చెవితో విని మనసులో ఉంచుకుంటాడు. కొందరు చెవితో విని పెన్నుతో రాసేస్తారు. ఇంకొందరు ఈ చెవితో విని మరొక చెవితో చెప్పి బయటకు వదిలేస్తాడు. అక్కడితో తన పని అయిపోయిందనుకుంటాడు. ఓ కుర్రాడు తరగతి గదిలో మాస్టారు పాఠం చెప్తుంటే తలను అటూ ఇటూ ఊపుతూ వింటాడు. ఎందుకురా అలా తల ఆడిస్తున్నావని అడిగితే తలను అటూ ఇటూ ఊపుతేనే ఒక చెవిలో నుంచి మరొక చెవిలోకి పోతోంది. అంతేకాదు, అది వేగంగా రెండో చెవిలోంచి బయటకు వేగంగా బయటకు వస్తోంది అన్ని జవాబిచ్చాడు ఆ కుర్రాడు.

# నక్షత్రాన్ని బట్టే పేర్లు పెట్టాలా?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458



నీరజ–విశాఖపట్నం

**ప్రశ్న: పిల్లల పేర్లు పెట్టేటప్పుడు తప్పకుండా జన్మ నక్షత్రానికి తగ్గట్టు పేర్లు పెట్టుకోవాలా? ఏ నక్షత్రానికి పుట్టిన పిల్లలకి ఏ పేర్లు పెట్టాలి? అలా పేర్లు పెట్టుకోవడానికి ఏవైనా పద్ధతులు ఉన్నాయా?**

**జవాబు:** క్లుప్తంగా చెప్తాను. **మొదటి విషయం:** జ్యోతిష్య శాస్త్ర ప్రకారం 27 నక్షత్రాలు ఉన్నాయి. ఈ నక్షత్రాలలో ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాలు ఉంటాయి. అలా 27 4=108 నక్షత్ర పాదాలు. ఈ పాదాలని 12 రాశులుగా విభజించారు. 108 పాదాలు, 12 రాశులు=9 పాదాలు. ఇలా ఒక్కొక్క రాశికి తొమ్మిది పాదాల చొప్పున కేటాయించటం జరిగింది. ఉదా. నక్షత్రాలలో మొదటిదైన అశ్విని నక్షత్రం 4 పాదాలు+రెండవదైన భరణి నక్షత్రం 4 పాదాలు+మూడవదైన కృత్తికా నక్షత్రంలో 1 పాదం=9... ఈ తొమ్మిది పాదాలు మేష రాశికి వర్తిస్తాయి. చార్టులో ఈ విషయం మీకు స్పష్టంగా బోధపడుతుంది. **ఇక రెండవ విషయం:** ఒక శిశువు జన్మించిన సమయాన్నిబట్టి అతడు ఏ నక్షత్రంలో జన్మించాడో, ఆ నక్షత్రం ఏ పాదంలో జన్మించాడో అన్నది నిర్ధారణ చేయబడుతుంది. ఉదా. శిశువు అశ్విని నక్షత్రంలో జన్మించాడనుకోండి. అశ్విని నక్షత్రంకి ఉన్న నాలుగు పాదాలకి నాలుగు అక్షరాలు సూచించారు. అవి చూ, చే, చో, లా. అశ్వనీ నక్షత్రం మొదటి పాదంలో పుడితే శిశువు పేరు మొదటి అక్షరం 'చూ' రెండవ పాదంలో పుడితే మొదటి అక్షరం 'చే' మూడవ పాదంలో పుట్టిన శిశువుకి పేరుకి మొదటి అక్షరం 'చో' నాలుగవ పాదంలో పుట్టిన శిశువుకి పేరు మొదటి అక్షరం 'లా'తో మొదలయ్యే విధంగా ఉండాలి. ఉదా. మొదటి పాదానికి (చూ) చూడామణి, రెండవ పాదానికి (చే)చేమంతి, మూడవ పాదానికి (చో) చోళ రాజు నాలుగవ పాదానికి (లా) లావణ్య.. ఈ విధంగా మీకు ఇష్టమైన పేర్లు పెట్టుకోవచ్చు. జన్మ నక్షత్రానికి తగినట్లుగా పేరు పెట్టుకోవటం చాలావరకు మంచి ఫలితాలని ఇస్తుంది. ఖగోళ శాస్త్రంలో గ్రహగతులన్నింటినీ ఎన్నో వేల సంవత్సరాల ముందు మనవాళ్లు అంచనా వేసి పెట్టారు. ఇప్పటికీ ఆ గ్రహగతులు మారలేదు.

ఇంత జ్ఞానం ఉన్న మన పండితులు, ఋషులు ఒక శిశువు పుట్టిన సమయాన్ని బట్టి ఆ వ్యక్తి జీవితం, నడవడిక, ఆలోచన, మేధస్సు, జీవనశైలి, స్పందించే విధానం ఎలా ఉంటుందో రూపకల్పన చేసి పెట్టారు. అందులో భాగమే పేర్లు పెట్టే పద్ధతి కూడా. ఋషులు ఊరికే ఈ నియమాలు పెట్టలేదు. మంచి ఫలితాలు ఆశించినట్లయితే ఈ పద్ధతిని అనుకరించి పేర్లు పెట్టడం చాలా ఉత్తమం. ఈ పద్ధతికి సంబంధించి రూపొందించబడిన ఒక సాధారణ పట్టిక ఇస్తున్నాను. మీ పిల్లలు మంచి ఫలితాలు పొందగలిగే జన్మ నక్షత్ర రీత్యా పేర్లు పెట్టటానికి ఉపయోగించుకోవచ్చు.

| నామాద్యక్షరము | నామ నక్షత్ర పాదములు-రాశులు | గణము | జంతువు |
|---|---|---|---|
| చూ చే చోలా | అశ్వని 4 పాదములు మేషం | దేవగణం | గుఱ్ఱం |
| లీలూ లేలో | భరణి 4 పాదములు మేషం | మనుష్య | ఏనుగు |
| ఆ ఈ ఊ ఏ | కృత్తిక 1 పాదము మేషం, 2,3,4 వృషభం | రాక్షస | మేక |
| ఒ వా వీ వు | రోహిణి 4 పాదములు వృషభం | మనుష్య | పాము |
| వే వో కా కి | మృగ 1,2 పాద॥ వృష, 3, 4 పా॥ మిథు | దేవగణం | పాము |
| కూ ఖం జ ఛ్చా | ఆరుద్ర 4 పాదములు మిథునం | మనుష్య | కుక్క |
| కే కో హా హి | పున॥ 1,2,3 పా॥ మిథు, 4 పాద॥ కర్కా॥ | దేవగణం | పిల్లి |
| హూ హే హో డా | పుష్యమి 4 పాదములు కర్కా॥ | దేవగణం | మేక |
| డీ డూ డే డో | ఆశ్లేష 4 పాదములు కర్కాటకం | రాక్షస | పిల్లి |
| మా మీ మూ మే | మఖ 4 పాదములు సింహం | రాక్షస | ఎలుక |
| మో టా టీ టూ | పుబ్బ 4 పాదములు సింహం | మనుష్య | ఎలుక |
| టే టో పా పి | ఉత్తర 1 పా॥ సింహం, 2,3,4 పా॥ కన్య | మనుష్య | గోవు |
| పూ షం ణా ఠా | హస్త 4 పాదములు కన్య | దేవగణం | దున్న |
| పే పో రా రి | చిత్త 1,2 పా॥ కన్య, 3, 4 పా॥ తుల | రాక్షస | పులి |
| రూ రే రో త | స్వాతి 4 పాదములు తుల | దేవగణం | దున్న |
| తీ తూ తే తో | విశాఖ 1,2,3 పా॥ తుల, 4 పా॥ వృశ్చి॥ | రాక్షస | పులి |
| నా నీ నూ నే | అనూ 4 పాదములు వృశ్చికం | దేవగణం | లేడి |
| నో యా యీ యూ | జ్యేష్ట 4 పాదములు వృశ్చికం | రాక్షస | లేడి |
| యే యో బా బి | మూల 4 పాదములు ధనుస్సు | రాక్షస | కుక్క |
| బూ ధా భా ఢా | పూ॥ షా 4 పాదములు ధనస్సు | మనుష్య | కోతి |
| బే బో జా జి | ఉ॥ షాఢ 1 పాద॥ ధన, 2,3,4 పా॥ మకరం | మనుష్య | ముంగిస |
| జూ జే జో ఖా | శ్రవణం 4 పాదములు మకరం | దేవగణం | కోతి |
| గా గీ గూ గే | ధని॥ 1,2 పా॥ మకరం, 3,4 పా॥ కుంభం | రాక్షస | సింహం |
| గో సా సీ సు | శతభిషం 4 పాదములు కుంభం | రాక్షస | గుఱ్ఱం |
| సే సో దా ది | పూ॥ భా 1,2,3 పా॥ కుంభం, 4 పా॥ మీనం | మనుష్య | సింహం |
| దు శ్యం ఝూ థా | ఉ॥ భా 4 పాదములు మీనం | మనుష్య | గోవు |
| దే దో చా చి | రేవతి 4 పాదములు మీనం | దేవగణం | ఏనుగు |

# యువతలో విపరీత ధోరణి

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

**నేటి భారత యువతలో కాలానుగుణంగా వస్తున్న శాస్త్ర సాంకేతిక మార్పులతో పాటు యువతలో విపరీత పోకడలు పుట్టుకొస్తున్నాయి, భారత్ లాంటి దేశాల్లో కూడా వేగంగా విస్తరిస్తున్నాయి. కుటుంబం, పిల్లల పెంపక భారం వద్దంటూ పెళ్లంటేనే నేటి యువతలో విముఖత పెరుగుతున్నది.**

పెళ్లి చేసుకోకుండానే పిల్లల్ని కనాలనుకోవడం, విడాకులు తీసుకోవడం, దంపతుల్లో ఒకరు మరణించడం కారణంగా మారిన 'సింగిల్ పేరెంట్' కల్చర్ కూడా పెరుగుతూ, తాము సింగిల్ పేరెంట్ అని సగర్వంగా చెప్పుకునే రోజులు వచ్చాయి. శీలానికి లేదా కన్యత్వానికి విలువ లేకుండా పోతున్నది. శారీరక సుఖాలు ప్రధానం అంటూ బరితెగించిన యువత పోకడలు కూడా పెరుగుతున్నాయి.

వీటికి తోడుగా 'సహజీవన సంసారాలు', 'డేటింగ్ సంబంధాలు', 'సిచ్యువేషన్‌షిప్ స్నేహాలు' క్రమంగా పెరుగుతున్నట్లు, యువతలో దాని పట్ల సానుకూల భావాలు చిగురిస్తున్నట్లు తెలుస్తున్నది.

ఇలాంటి డిజిటల్ కాలపు వింత బంధాలను ప్రముఖులు సైతం పాటించడంతో సాధారణ యువతలో కూడా వీటి పట్ల ఆకర్షణ పెరుగుతోంది.

### సహజీవన సంబంధాలు (లివ్‌ఇన్ లేదా కోహాబిటేషన్ రిలేషన్‌షిప్):

విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ, అమీర్ ఖాన్‌కిరణ్ రావ్, సైఫ్ అలీ ఖాన్‌కరీనా కపూర్, జాన్ అబ్రహామ్‌బిపాసా బసు, బోని కపూర్, శ్రీదేవి లాంటి పలువురు బాలీవుడ్ జంటలు సహజీవనం చేసిన తర్వాతనే వివాహం చేసుకున్నారని తెలిసిందే! దిన దినం సహజీవన సంబంధాలు పెరగడం, నేటి పౌర సమాజం కూడా నెమ్మదిగానైనా వాటిని అంగీకరించడం జరుగుతున్నది. సహజీవన విధానం భారత్‌లో చట్ట వ్యతిరేకం కానప్పటికీ, సామాజికంగా పూర్తి అంగీకారం లేకపోవడం, సహజీవన పద్ధతిని దురాచారంగా కూడా పరిగణించడం జరుగుతుంది. నేటి డిజిటల్ యువత పెళ్లికి ముందే ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత ఇరువురి అభిరుచులు కలిసిన తర్వాత పెళ్లి పీటల మీదికి చేరడం జరుగుతోంది. ఒకవేళ ఇద్దరి ఆలోచనలు, జీవనశైలి లో విభేదాలు పొడచూపినపుడు వారు ఏ క్షణంలోనైనా విడిపోయి తమ తమ వ్యక్తిగత జీవితాలను కొనసాగించే వెసులుబాటును తీసుకొంటున్నారు.

సహజీవన సంసారాలకు మొగ్గు చూపడానికి ప్రధాన కారణాలుగా వారి మధ్య అభిరుచుల ఏకీకరణ స్పష్టత, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే వివాహం చేసుకోవడానికి నిర్ణయం తీసుకోవడం, ఇద్దరి మనోభావాలను అర్థం చేసుకోవడం, ఆర్థిక వనరులను తెలుసుకుంటూ సమస్యలను అధిగమించడం, భావోద్వేగ సమతుల్యతల సాధన, గృహ సంబంధ పనులను ఇరువురు పంచుకోవడం, పెళ్లి చేసుకోకుండానే శారీరక, మానసిక సుఖాలను స్వంతం చేసుకోవడం, వివాహం చేసుకోవడానికి ఇష్టపడని యువత సహితం సహజీవన పద్ధతులను ఆచరణలో పెట్టుకోవడం, పిల్లల్ని కనడం/పెంచడం భారం అనుకునే యువత, లైంగిక వాంఛలను మాత్రమే తీర్చుకోవడం, పెళ్లికి పూర్వం ఒకరినొకరు అర్థం చేసుకోవడం, ప్రేమతో సహజీవనం చేసి పెళ్లితో ముగింపు పలకడం లాంటి పలు అంశాలను పేర్కొనవచ్చు. భారత్‌లో సహజీవనం చేస్తున్న జంటను చులకనగా చూడడం, వివక్ష చూపడం, సామాజిక వ్యతిరేకతను ఎదుర్కోవడం కొనసాగుతోంది.



### డేటింగ్ రిలేషన్‌షిప్!

18 యేండ్లు దాటిన ఒక యువతి, ఒక యువకుడు పెళ్లికి ముందు ఒక అంగీకారానికి వచ్చి ఒకే ఇంట్లో కలిసి జీవించడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి దీర్ఘకాలం పాటు జంటగా జీవించడాన్ని 'సహజీవనం లేదా లివ్ ఇన్ రిలేషన్‌షిప్' అని పిలుస్తాం. సహజీవనంలో ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకొని ఇష్టపడిన తర్వాత పెళ్లి కూడా చేసుకోవడం జరుగుతుంది లేదా ఇద్దరి అలవాట్లు/ అభిరుచులు/ ఆచారాలు/జీవనశైలి/ఆలోచనలు కలవవని నిర్ణయించుకున్నపుడు ఆ సహజీవన జంట విడిపోయి స్వేచ్ఛగా బతకడానికి నిర్ణయించుకుంటారు. సహజీవన సంసారాల్లో యువ జంట లైంగిక సంబంధాలను కూడా కొనసాగించవచ్చు.

డేటింగ్ అనే ఆచారం ఒకటి, మూడు మాసాల స్వల్ప కాలం పాటు ఇద్దరు కలిసి గాఢ స్నేహితులుగా కలిసి గడపడం, వేరు వేరు ఇండ్లల్లో జీవిస్తున్నప్పటికీ కలిసి తిరుగుతూ అన్ని రకాలుగా ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నంగా డేటింగ్ బంధాలను భావించాలి.

ఒక ఆహార పదార్థాన్ని ఎలా ఉందో రుచి చూసి, నచ్చితే తినడం నచ్చని యెడల వదిలేయడం జరుగుతున్నట్లుగా ఇద్దరి మధ్య సంబంధాన్ని డేటింగ్ బంధంతో కొద్ది సమయంలోనే ఒకరినొకరు తెలుసుకోవడం జరుగుతుంది.

డేటింగ్‌లో జంట లైంగిక సంబంధాలను తప్పనిసరిగా పెట్టుకోవాలనే నియమం లేకపోయినప్పటికీ కొన్ని సార్లు అదే ప్రధాన అంశంగా కూడా తీసుకోబడుతున్నది. డేటింగ్ సంబంధాన్ని సీరియస్‌గా కూడా తీసుకోవలసిన పని లేదు. అది ఒక తేలికైన స్వల్పకాలిక సుఖాలను తీర్చే తాత్కాలిక సంబంధం కూడా అయి ఉండవచ్చు. ఇద్దరిలో ఒకరు యువతి, మరొకరు యువకుడు కావచ్చు లేదా ఒకే లింగానికి చెందిన జంట కూడా డేటింగ్ చేయవచ్చు. జంట ఒక మంచి స్నేహితులుగా కలిసి తిరగడాన్ని కూడా డేటింగ్‌గా భావించవచ్చు. డేటింగ్ చేసిన జంట కొంతకాలం తర్వాత సహజీవనం చేసి, తర్వాత వివాహ మండపానికి కూడా చేరవచ్చు.

### సిచ్యుయేషన్ రిలేషన్‌షిప్

సహజీవనం, డేటింగ్ బంధాలతో పాటు నేడు మరో విచిత్రమైన సంబంధాలను కూడా నేటి యువత ఆచరిస్తున్నారు. దానినే సిచ్యుయేషన్‌షిప్ (పరిస్థితులను బట్టి) బంధాలు అని పిలుస్తున్నారు. జంటలోని యువత ఒకరినొకరు ఎలాంటి హామీలకు కట్టుబడకుండా తాత్కాలిక సుఖం పొందడానికి ఏర్పరుచునే స్నేహ లాంటి బంధాన్ని సిచ్యుయేషన్‌షిప్ బంధంగా వర్ణిస్తున్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఇద్దరు సన్నిహితంగా, అనుబంధాలతో కలిసి సరదాగా తిరగడాన్ని సిచ్యువేషన్‌షిప్ రిలేషన్‌గా వర్ణిస్తున్నారు.

### సహజీవన, డేటింగ్, సిచ్యువేషన్‌షిప్ సంబంధాలు చట్ట అంగీకారాలు

భారత రాజ్యాంగ ఆర్టికల్ 21 ప్రకారం పౌరులకు స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా కల్పించబడిందని, దీని ప్రకారం సహజీవనం నేరంగా పరిగణించబడదని సుప్రీమ్ కోర్టు కూడా పేర్కొనడం విశేషం. అదే విధంగా 2005 గృహ హింస చట్టం ప్రకారం కూడా సహజీవన సంబంధాలను 'గృహ సంబంధాలుగానే (డొమెస్టిక్ రిలేషన్‌షిప్)' చూడాలని నిర్ణయించింది. చట్ట పరిధిలో సహజీవనం చేసిన యువతి కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో భరణం లేదా మెయిన్‌టెనెన్స్ పొందే హక్కు కూడా ఉంటుందని తెలుపుతున్నది. సహజీవనం చేసిన జంటకు జన్మించిన సంతానానికి ఆస్తి హక్కులు సంక్రమిస్తాయని తెలుస్తోంది. సహజీవనం చేస్తున్న జంటను వారి తల్లితండ్రులు కూడా విడదీయలేరని చట్టం పేర్కొంటున్నది. సహజీవనం చేసిన జంటకు చట్టం ఎలాంటి రక్షణ కల్పించకపోవడంతో వివాహిత యువతులకు కల్పించిన చట్ట రక్షణలు వీరికి వర్తించవు. సహజీవన జంట మధ్య విభేదాలు వచ్చినపుడు వెంటనే వారు విడిపోయి తమ తమ జీవితాలను కొనసాగించే వెసులుబాటు మాత్రం ఉన్నది. దీర్ఘకాలం పాటు సహజీవనం చేయడం, పౌర సమాజంలో ఆ జంట కలిసి తిరగడం, ఇద్దరికీ 18 యేండ్లకు పైగా వయస్సు ఉండడం, పెళ్లి అయిన జంట వలె లైంగిక సంబంధాలను కలిగి ఉండడం, ఇద్దరి ఆదాయాలను కలిపి ఖర్చు చేయడం, గృహ సంబంధ



పనుల్లో పరస్పరం సహాయం చేసుకోవడం, ఇద్దరు తమ హక్కులు బాధ్యతలను పంచుకోవడం, సంతానాన్ని కనడం లాంటి ప్రత్యేక సందర్భాల్లో సహజీవనాన్ని కూడా వివాహం జరిగినట్లుగానే భావించాలని పేర్కొనడం జరుగుతోంది.

### హిందూ పౌర సమాజ వ్యతిరేకతలు

ఏక పత్ని వ్రతంతో పాటు ఏక పతి వ్రతం పునాదుల మీద పెరిగిన భారతీయ సనాతన హిందూ పౌర సమాజం సహజీవన సంసారాలు, డేటింగ్, సిచ్యుయేషన్‌షిప్ లాంటి వినూత్న యువ సంబంధాలను తీవ్రంగా వ్యతిరేకించడం చూస్తున్నాం. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి శారీరక సంబంధాలు అవసరం లేదు. పెళ్లి చూపుల్లోనే ఒకరినొకరు అర్థమ చేసుకోవడం లేదా కొంత సమయం తీసుకొని పరస్పరం అర్థం చేసుకోవడం మంచి పద్ధతిగా నమ్మాలి. భారతదేశంలో దుర్యోధన, దుశ్శాసనులు, రావణాసురులకు స్థానం లేదు. మన సనాతన ధర్మమే మనకు సన్మార్గాన్ని చూపిస్తున్నది. సీతారాములు మనకు జీవన మార్గాన్ని బోధిస్తున్నారు. అన్నింటి కన్నా శీలం ముఖ్యం అంటున్నది భారత నాగరికత. ప్రేమలు మూన్నాళ్ల ముచ్చట అవుతున్నది. డిజిటల్ యుగపు భారత యువతలో కూడా రోజు రోజుకు, ముఖ్యంగా మహా నగరాల్లో ఈ పోకడలు పెరుగుతున్నాయని, సగానికి పైగా యువత వీటిని అంగీకరిస్తున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లోని ముంబాయి మహా నగరం వీటికి కేంద్రంగా నిలుస్తున్నది. ఈ సంబంధాలను ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదా అనుమతులు అవసరం లేదని, విడిపోయే సందర్భాల్లో కూడా విడాకులు తీసుకోవడం లాంటి ప్రస్తావన ఉండదని తెలుసుకోవాలి. సహజీవనం చేసిన యువ జంటలు అధిక శాతం వరకు వివాహాలు కూడా చేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారత మహా నగరాల్లో 50 శాతం వరకు యువత వివాదాస్పద నూతన రిలేషన్‌షిప్ బాటన నడుస్తున్నారని తెలుస్తున్నది. ప్రేమ వివాహాలు అన్ని కొనసాగడం లేదని, పెద్దలు కుదుర్చిన పెళ్లిళ్లు కూడా విడాకుల వరకు వస్తున్నాయని గమనించి, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ, పెళ్లంటే ఒక జంట మాత్రమే ఒక్కటి కావడం కాదని, రెండు కుటుంబాల కలయికగా వివాహాన్ని చూస్తున్న పౌర సమాజంలో జీవిస్తున్నామని తెలుసుకుంటూ నేటి యువత పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించకుండా తమ జీవితాలకు పెళ్లితో చక్కటి పరిష్కారం వెతుక్కొని శాంతియుత కుటుంబ నిర్మాణం జరుపుకుంటారని కోరుకుందాం. ప్రేమించిన వ్యక్తిని నేరుగా వివాహం చేసుకోవడం ఉత్తమమని, సహజీవన సంసారాలు సదా చక్కటి పరిష్కారం కాదని తెలుసుకుందాం. జీవిత భాగస్వామికి అందరి సమక్షంలో మూడు ముళ్ల వేసి, నూతన జంట పెద్దల దీవెనలు పొందాలని ఆశిద్దాం.

# ఇత్తడికి మరో పేరు అజ్జరం!

షేక్ అబ్దుల్ హకీం జాని

గ్రామాలలో అనేక వృత్తులు చేసుకునేవారు మనకు కనిపిస్తుంటారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జరం గ్రామంలోని ప్రజలు ఇత్తడి సామాన్లనే తయారు చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ గ్రామంలో దాదాపు వంద సంవత్సరాల నుండి ఇత్తడి సామాగ్రి తయారీ పరిశ్రమ నెలకొని ఉందని, మరికొందరు 200 సం॥ చరిత్ర ఉందని చెబుతుంటారు. నాలుగు వేల జనాభా కల అజ్జరం గ్రామ ప్రజల్లో 90 శాతం మంది ఇత్తడి సామాగ్రి తయారీనే వృత్తిగా చేసుకుని జీవనం పొందుతున్నారు. ఇత్తడి పరిశ్రమ వల్ల అజ్జరం గ్రామం ఖండాంతర ఖ్యాతినార్జించింది. కొన్ని పట్టణాలలో ఇత్తడి సామాగ్రి అమ్మేవారు తమ దుకాణాలకు అజ్జరంవారి ఇత్తడి షాపు అని పేర్లు పెట్టుకోవడం చూస్తుంటాం.

పాత రోజుల నుండే ఇత్తడి పాత్రల వినియోగం ఉంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా చాలా సందర్భాల్లో పురాతన తవ్వకాల్లో ఎక్కువగా ఇత్తడి పాత్రలు బయట పడిన సందర్భాలు ఉన్నాయి. బంగారంలో ప్రకాశవంతంగా మెరుస్తూ ఉండే ఇత్తడి వస్తువులను ఇప్పుడు గృహాలంకరణలో విరివిగా వాడుతున్నారు. ఇత్తడి పాత్రల వాడకం మత పరమైన వేడుకలు, పండుగలు, వివాహాది శుభకార్యక్రమాలు, సంప్రదాయ ఆచారాలతో కూడా ముడిపడి ఉంది. పూర్వ కాలంలో కొందరు రాజులు ఇత్తడితో వంట సామాగ్రిని తయారు చేసేందుకు కొందరు కార్మికుల్ని ఈ ప్రాంతానికి తీసుకుని వచ్చారట. వారంతా ఇక్కడే స్థిరపడిపోయారు. అలా నేటికీ ఇక్కడ అన్ని రకాల ఇత్తడి సామాగ్రిని తయారు చేసేవారు కొనసాగుతునే ఉన్నారు.



## పలురకాల ఇత్తడి సామాగ్రి

గుడి గంటల నుండి చర్చి గంటల వరకు 50 గ్రాముల గంట నుండి 500 కిలోల గంటల వరకు ఇక్కడ తయారౌతాయి. గృహోపకరణాలుగా ఉపయోగించే ఇత్తడి చెంబులు, గుండిగలు, పళ్ళాలు, బక్కెట్లు ఇలా అనేక రకాల సామాగ్రి ఇక్కడ తయారై దేశ విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. దేవాలయాలకు సంబంధించిన ఇత్తడితో తయారు చేసిన మకర తోరణాలు, కలశాలు, ధ్వజస్తంభం తొడుగులు, పంచలోహ విగ్రహాలు ఇత్తడితో ఇక్కడివారు తయారు చేస్తారు. ఇత్తడితో దేవతా విగ్రహాలను జీవం ఉట్టిపడేలా ఇక్కడివారు తయారు చేస్తున్నారు. అన్నదాత రైతన్న పంటను కాపాడుకోవడానికి పురుగు మందులు పిచికారీ చేసే పది లీటర్ల ఇత్తడి స్ప్రేయర్ల తయారీకి కూడా అజ్జరం గ్రామం చాలా ప్రసిద్ధి చెందింది.

ఇలా తయారు చేసిన వస్తువులను మార్కెట్లో షాపులకు విక్రయిస్తారు. వివాహాలు, శుభకార్యాల సీజన్ సమయంలో అజ్జరం గ్రామం కళకళలాడుతుంది. నేరుగా వివాహాది శుభకార్యములకు కావలసిన కళా వస్తువులను వ్యాపారులతో సంబంధం లేకుండా వినియోగదారులే అక్కడికి వెళ్లి వారికి నచ్చిన వస్తువులను అతి తక్కువ ధరలకు ఇత్తడి వస్తువులు కళాకారుల నుంచే కొనుగోలు చేస్తుంటారు.

గ్రామంలో ఏ ఇంటి గుమ్మం ముందు చూసినా ఇత్తడి వస్తువుల తయారు చేసే చిన్నతరహా పరిశ్రమను నడిపే కళాకారులే మనకు దర్శనమిస్తాయి. ఎటు చూసినా టంగు, టంగు, టక్కుం టక్కుం అనే లయబద్ధమైన మోతలే వినిపిస్తాయి. అజ్జరం ఇత్తడి సామాగ్రికి మనదేశంలోనే కాక, విదేశాల్లో సైతం భారీ డిమాండ్ ఉంది. ఆ కారణంగా ఏటా కోట్లలో వ్యాపారం సాగుతోంది.

దేవతామూర్తుల విగ్రహాలు, పూజా సామాగ్రి, బిందెలు, పళ్ళాలు, బొమ్మలు ఇలా ఎంత పెద్ద విగ్రహాన్ని అయినా ఇత్తడితో అందంగా మలిచి ఇవ్వడం



ఇక్కడ చేతి వృత్తిదారుల ప్రత్యేకత. ఒకప్పుడు కోల్‌కత్తా, చెన్నై నుండి ముడి సరుకును తెప్పించుకునేవారు. రోజుల వ్యవధిలోనే ఇత్తడి ముడిసరకుకు తమ నైపుణ్యంతో ఈ కళాకారులు జీవం పోస్తున్నారు. అజ్జరంలో ఇటువంటి కళాకారుల కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఇత్తడి కడ్డీలను షీట్లుగా చదును చేసి, బిందెలు, గంగాళాలు, పాత్రలు, పూజా వస్తువులు వంటి వివిధ వస్తువులను తయారు చేస్తుంటారు. తర్వాత ఉత్పత్తులను లాత్ యంత్రంపై పాలిష్ చేస్తారు.

## నాణ్యతను బట్టి ధర

అజ్జరం గ్రామంలో తయారు చేసిన వస్తువు నాణ్యతను బట్టి కేజీ వస్తువు ధర రూ.600 నుండి రూ.900 వరకు ఉంటుంది. ముడి సరుకు ధరను బట్టి వస్తువుల ధరలలో మార్పు ఉంటుంది. ఇక్కడున్న ధరలకు రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి ఇత్తడి వస్తువులు లభించవని స్థానిక కళాకారులు చెబుతున్నారు.



రాగి, జింక్ మిశ్రమంతో ఇత్తడి వస్తువులు తయారు చేస్తారు. ఇత్తడి పాత్రలను ఉపయోగించడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఇత్తడి పాత్ర దోహదపడుతుంది. శరీర ఆరోగ్యానికి ఇత్తడి పాత్రల వాడకం మంచిదని ఆయుర్వేదం కూడా సూచిస్తుంది. హోల్ సేల్ వ్యాపారులకు ఏ ధరకు ఇస్తారో రీటైల్ వినియోగదారుడికి సైతం అదే ధరకు వస్తువులు అజ్జరం గ్రామంలో విక్రయిస్తారు. తయారీ కేంద్రాలు ఉన్నందునే తక్కువ ధరకు ఇత్తడి వస్తువులను విక్రయిస్తుంటారు.

## సినిమాలలో ఇత్తడి బిందెలు

‘ఎల్లువొచ్చి గోదారమ్మా’ అనే పాట నృత్య సన్నివేశం కోసం వెయ్యి బిందెలు వరుసలో కనిపిస్తాయి. ఈ బిందెలు, పెద్ద ఇత్తడి కుండలు అజ్జరం గ్రామం నుండే సరఫరా చేశారు. వాల్మీకి, పెళ్ళిసందడి, బావ బావమరిది, అబ్బాయిగారు, వారసుడొచ్చాడు ఇత్యాది చిత్రాల సన్నివేశాలు అజ్జరం గ్రామంలో షూటింగ్ జరుపుకున్నాయి.

## దేశ విదేశాలకు..

సాధారణ గ్రామమైన అజ్జరంలో తయారైన ఇత్తడి వస్తువులు ప్రస్తుతం దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విదేశాల నుంచి వాట్సప్ కాల్ చేసి మరీ వారికి కావాల్సిన వస్తువులు తయారు చేయించుకుంటున్నారు. అజ్జరం ఇత్తడి వస్తువులు దేశ, విదేశీ ప్రజల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అజ్జరం వస్తువుల కోసం వచ్చే వినియోగదారులు సైతం ఇక్కడ లభించే ఇత్తడి వస్తువులు ఎంతో నాణ్యంగా ఉంటాయని, బయట దొరికే వస్తువులలో ఇంత క్వాలిటీ ఉండదని చెబుతుంటారు. అందుకే స్వయంగా తామే అజ్జరం గ్రామానికి వచ్చి ఇత్తడి వస్తువులు కొనుగోలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. వివాహానికి కావలసిన జల్లెడలు, పీటలు పళ్ళాలు రకరకాల వస్తువులు అతి తక్కువ ధరలకే ఇక్కడ లభిస్తున్నాయని వినియోగదారులు అంటుంటారు.



## పోటీనిస్తున్న ఫ్యాక్టరీలు

అజ్జరం గ్రామస్థులు తర తరాలుగా ఇత్తడి వస్తువుల తయారీపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. పెద్దపెద్ద యంత్రాలను వీటి తయారీలో ఉపయోగించరు. ప్రస్తుతం ఫ్యాక్టరీలలో తయారైన ఇత్తడి వస్తువులు ఇబ్బడిముబ్బడిగా మార్కెట్లో అందుబాటులో ఉండడంతో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చేతివృత్తుల వారికి ఆదరణ కాస్త తగ్గింది.

గతంలో పెళ్ళిళ్ళలో వంటలు వండటానికి అనేక గ్రామాలవారు ఇక్కడి నుండే వంట సామాగ్రిని కొనుగోలు చేసి తీసుకుని వెళ్ళేవారు. ప్రస్తుతం ఊరూ, వాడా టెంట్ హౌస్‌లు వెలిశాయి. దాంతో వంట సామాగ్రిని కొనుగోలు చేసేవారి కంటే అద్దెకు తీసుకుని ఉపయోగించుకునే వారి సంఖ్య పెరిగింది.

పులిమీద పుట్రలా నవ నాగరికతలో యంత్రాలు ప్రవేశించడంతో ఈ పని చేసే చేతి వృత్తి కార్మికులకి పనిలేకుండా పోయింది. యంత్రలపై తయారు చేసిన వస్తువులు వంద శాతం నాణ్యమైనవని చెప్పలేం. అయితే చేతి వృత్తులవారు తయారు చేసిన వస్తువులకంటే అవి ధర పరంగా తక్కువగా ఉంటున్నాయి. ప్రతి ఊళ్ళో ఇలా యంత్రాలపై తయారు చేసే వస్తువులు కొంతలో కొంత తక్కువ ధరకు లభించడం వల్ల అజ్జరం కళాకారులకు పనులు తగ్గాయని చెప్పవచ్చు. పైగా కూలీలకు ఇవ్వవలసిన దినసరి వేతనాలు పెరిగిపోవడం వల్ల ఖర్చులు తడిసి మోపెడౌతున్నాయి.

కాలక్రమేణా ఇత్తడి వాడకం తగ్గి, నవ నాగరిక ప్రపంచంలో స్టీలు, ఇతర లోహాలు, కుక్కర్ల వాడకం పెరిగిపోయి, యంత్రాలు వచ్చి ఈ పని చేసే చేతి వృత్తి కార్మికులకి పని లేకుండా పోయింది. నేటి తరం వారికి ఈ పనిని నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గిపోయింది. పనినే నమ్ముకుని జీవనాధారం కోల్పోయిన పలు కుటుంబాలు ఏ ఇతర పనిలోకి వెళ్ళలేక జీవనం సాగించలేక అప్పుల పాలైన కుటుంబాలు అజ్జరంలో కనిపిస్తున్నాయి. కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్లు అజ్జరం కళాకారులు ఆర్థికంగా వెనుకబడటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఈ ఊరిలో తయారైన బిందెలకి రాష్ట్రం మొత్తం మంచి పేరు ఉంది. ఇత్తడి సంబంధిత వస్తువులకి అజ్జరం మంచి పేరెన్నిక కలిగింది. దేవతామూర్తుల విగ్రహాలు, హస్తకళలపై మక్కువ కలిగినవారు మాత్రం అజ్జరంలో తయారయ్యే ఇత్తడి వస్తువుల పట్ల ఎంతో మక్కువ చూపిస్తున్నారు. ఒక తరం నుండి మరో తరానికి వారసత్వ సంపదగా వస్తున్న అజ్జరం మెరిసే ఇత్తడి కళను కాపాడుకోవలసిన అవసరం ఉంది.

## ఫిబ్రవరి 23, 2025 నుండి మార్చి 1, 2025 వరకు



# వారఫలం


**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం దైవ సంబంధిత, సామాజిక సేవా సంబంధిత కార్యక్రమాలలో పాల్గొంటారు, కారణం లేని చికాకులు అప్రశాంతతకు కారణం అవుతాయి. ముఖ్యమైన శుభప్రదమైన కార్యక్రమాలు ప్రయాసమీద నెరవేరతాయి. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి.సమయోచితంగా వ్యవహరించి మీకు రావలసిన సొమ్ము చాలా వరకు అందుతుంది.

### వృషభం

ఈ వారం విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు. కుటుంబ బాధ్యత  నెరవేర్చడంలో క్రమబద్ధమైనటువంటి ప్రణాళిక లను రూపొందించుకొని తదనుగుణంగా అడ్డు వేస్తారు. వాయిదా పడుతున్న కోర్టు వ్యవహారాలు ఓ కొలిక్కి వస్తాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి ప్రశాంతంగా ఆలోచించి సంయమనంతో వాక్చాతుర్యాన్ని కనబరచి, కీలక వ్యవహారాలను చక్కబరచుకోగలుగుతారు.

### మిథునం

ఈ వారం వాహన మరమ్మత్తులు చేస్తారు. విశాల హృదయంతో వ్యవహరిస్తారు. అందరి పట్ల సమన్యాయాన్ని కనబరుస్తారు. మంచి వ్యక్తిగా గుర్తింపును పొందుతారు. శుభకార్య యత్నాలు కలిసి వస్తాయి.మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలర్ ధరించండి. రాజకీయ రంగంలోని వారికి అనుకూలం. జీవిత భాగస్వామితో కీలక విషయాలపై చర్చలు సాగిస్తారు.

### కర్కాటకం

ఈ వారం క్రీడాకారులు మంచి ఫలితాలను సాధించ గలుగుతారు. దీక్ష కార్యక్రమాలు చేపడతారు. వ్యాపార పరంగా మీరు తీసుకునే నిర్ణయాలు ఫలిస్తాయి. మిత్రుల సలహాలు, సూచనలను పాటిస్తారు. పెద్దల పేరు మీద స్వయంపాకం ఇవ్వండి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి.

### సింహం

ఈ వారం సొంత నిర్ణయాలను తీసుకుంటారు. దారి, తెన్నూ లేని వ్యవహారాలను ఒక గాడిలో పెట్టడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సెంటిమెంట్ విషయాలు కలిసి వస్తాయి. వాహన యోగ సూచన. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. వినోద కార్యక్రమాలకు, విలాసాలకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. దైవ దర్శనం చేసుకుంటారు.

### కన్య

ఈ వారం నూతన రంగంలోని వారి తోటి పరిచయాలు ఏర్పడతాయి. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండగలుగుతారు. ఉత్తర ప్రత్యుత్తరాలను సాగిస్తారు. బంధువుల రాక ఆనందానికి కారణమవుతుంది.పక్షులకి నీళ్లని పెట్టండి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి.  నిష్కారణంగా నిందారోపణలకు గురి చేస్తున్న వారిన గుర్తిస్తారు.

### తుల

ఈ వారం స్వార్థ ప్రపంచాన్ని చూసి నివ్వెరపోతారు. పార్ట్ టైం జాబ్ ను సంపాదించుకో గలుగుతారు. ఆశించిన ఋణాలను అందుకోగలుగతారు. ప్రతి విషయాన్ని స్ఫూర్తిగా తీసుకుంటారు. పక్షులకు దాన వేయండి. రచనా వ్యాసంగా లను సాగిస్తారు. గృహాలంకరణలకు ప్రాముఖ్యతనిస్తారు. ఉపయుక్తమైన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.   సుమంగళి పసుపు తో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి.

### వృశ్చికం

ఈ వారం ఆరోగ్యం సలతగా ఉంటుంది. వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.  శ్రేయోభిలాషులతో కలిసి చర్చలను సాగిస్తారు. ఆహార నియమాలను పాటించడం చెప్పదగినది. ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక స్థితి మెరుగ్గా ఉంటుంది. ప్రజా సంబంధాలను మరింతగా వృద్ధి చేసుకుంటారు.పక్షులకి దాన వేయండి. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### ధనస్సు

ఈ వారం  చెల్లింపుల విషయమై ఎక్కువగా ఆలోచిస్తారు. ఉత్తమమని భావించిన  వ్యవహారాలలో ఇతరులకు జోక్యం కల్పించకండి. పక్షులకి నీళ్లు  పెట్టండి.  వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు, సోదరులను మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు, వాహన సౌఖ్యం పొందుతారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది.

### మకరం

ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. దూర ప్రాంతాల నుంచి శుభవార్తలు వింటారు. పక్షులకి నీళ్లని పెట్టండి. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు.


### కుంభం


ఈ వారం  ఊహించని అవకాశాలు లభిస్తాయి. మిత్రుల నుంచి ధనలాభం పొందుతారు. వృత్తి, వ్యాపారాలకు అనుకూలంగా వుంటుంది. ఆరోగ్యం, వాహనాల పట్ల మెలకువ అవసరం. వస్తు లాభం పొందుతారు. కుక్కలకి చపాతీలు తినిపించండి. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. శివాలయాల్లో సెనగలు ఇవ్వండి.


### మీనం

ఈ వారం  ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. చర్చాగోష్టులలో చురుకుగా పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నూతన వస్తు, వస్త్ర, వాహన అమ్మకాలు, కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. పక్షులకి నీళ్లు పెట్టండి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి.వృత్తి వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

# ఈ వారం 'కార్టూన్స్'


భాష,
సాహిత్య
ప్రమాణాల్ని
కాపాడుదాం
సినిమా వాళ్ళు, యూ ట్యూబర్లు, నాయకులు మన భాషను
భ్రష్టు పట్టిస్తున్నారు కదా? వాళ్ళని మీరేమి చేయలేరా??
భాషా సాంస్కృతిక శాఖ


బిల్డింగులకు, యూనివర్సిటీలకు మార్చినట్లు
విగ్రహాలకు పేర్లు మార్చడం కుదరదు సార్..!!
మంత్రి


ఓడినా ప్రజల్లోనే ఉంటాం
వద్దనే కదా ఓడించింది!!
TV







ఈ
అడ్వెంచర్ టవర్
డెన్మార్క్‌లోని జీలాండ్ దీవిలో
ఉంది. ప్రకృతి ప్రేమికులను,
పర్యాటకులను ఎంతగానో
ఆకర్షిస్తోంది ఈ టవర్.



